# క్రీడాకారులకు మినీస్టేడియంలో శిక్షణ

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



28వ సబ్ జూనియర్ జాతీయ స్థాయి సెపక్తక్రా ఛాంపియన్‌షిప్ ఈ నెల 23 నుండి 27 వరకు జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో నిర్వహించబడనున్నది. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బాలురు, బాలికల జట్టు పాల్గొననుంది. ఈ సందర్భంగా జట్టుకు సంబంధించిన క్రీడాకారులు గత ఐదు రోజులుగా ఒంగోలులోని డీఎస్సీ మినీ స్టేడియంలో శిక్షణ పొందుతున్నారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో 21వ డివిజన్ అధ్యక్షులు ప్రకాశం జిల్లా సెపక్తక్రా అసోసియేషన్ నూతనంగా ఎన్నుకోబడిన చైర్మన్ గొల్లపూడి బాబురావు, ప్రెసిడెంట్ యనమల సురేష్ క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు క్రీడాకారులతో మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతూ మరెన్నో విజయాలు సాధించాలని ఆశీర్వదించారు. అలాగే జిల్లా సెక్రటరీ మధు, ట్రెజరర్ రవి ప్రసాద్, కోచ్‌లు బి. శ్రీనివాసులు, రంజిత్ క్రీడాకారులకు అభినందనలు తెలియజేసి, పోటీల్లో ఉత్తమ ప్రదర్శన చేయాలని ఆకాంక్షించారు.

# నూతన వధువరులను ఆశీర్వదించిన మాజీమంత్రి శిద్దా

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



గుంటూరు వి.ఏ.ఆర్ గార్డెన్స్‌లో జరిగిన విశ్రాంత అడిషనల్ సూపరింటెండ్ పోలీస్ అధికారి వాకా రాంబాబు, వెంకటేశ్వరమ్మ దంపతుల కుమారుడు శ్రీనివాస ప్రదీప్, రూపశ్రీ వివాహానికి రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు హాజరై నూతన వధువరులకు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు.

# శివం శరణాలయంలో ముస్లిం మహిళలకు బియ్యం.. చీరలు పంపిణీ

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



రంజాన్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ఒంగోలు సంతపేటలోని శివం శరణాలయం నందు సాగర్ హోటల్ అధినేత దేవా రెడ్డి తిరుపతి నాలుగో వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు శరత్ బాబు ఆధ్వర్యంలో పేద ముస్లిం మహిళలకు నిత్యావసర సరుకులు, చీరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కామేపల్లి చంద్రశేఖర్, సమాజ సేవకులు మండవ మురళీకృష్ణ ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మారెళ్ళ వివేకానంద ముఖ్య అతిథులుగా హాజరై నిత్యవసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి ద్వారా ఎంతోమంది అన్నార్తులకు సహాయ సహకారాలు అందించటం శుభ పరిణామం అని,అందులో భాగంగా ఒంగోలు సాగర్ హోటల్ అధినేత దేవారెడ్డి తిరుపతిరావు వర్ధంతిని పురస్కరించుకొని వారి కుమారుడు శరత్ బాబు ఇటువంటి సత్కార్యం నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి శివం ఫౌండేషన్ తదితర సేవా సంస్థల సేవా నిరతి కలిగిన వాళ్ళని గుర్తించి పురస్కారాలతో పాటు ఆర్థికంగా, సహాయ సహకారాలు అందించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా పేదలు 300 మందికి అన్నదానం నిర్వహించారు.

# మహిళా మోసాల పట్ల మహిళలకు అవగాహన సదస్సు

: సీఐ డి మల్లికార్జునరావు

**జె. పంగులూరు ఫిబ్రవరి 2 ప్రభాతవార్త**

మహిళా చట్టాల గురించి, ఆన్లైన్లో మోసాల గురించి, సైబర్ మోసాల గురించి 1930కి డయల్ చేసి మీ సమస్యలను తెలియజేయాలని సిఐ.డి.మల్లికార్జునరావు తెలిపారు. మండలంలోని చందలూరు, ముప్పవరం, పంగులూరు, సీ.సీ క్లస్టర్ ల లో వి.వో .ఏ లతో జరిగిన రివ్యూ సమావేశం ఏ.పి.ఎం. సి.హెచ్. కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీస్ శాఖ సీ.ఐ.డి. మల్లికార్జున రావు ఎస్సై.బి. వినోద్ బాబు సోమవారం నిర్వహించారు. ముప్పవరం గ్రామంలోని అంగనవాడి భవనంలో సి.సి క్లస్టర్ల రివ్యూ సమావేశంలో సి.ఐ.డి. మల్లికార్జునరావు మాట్లాడుతూ మహిళా చట్టాలగురించి, ఆన్లైన్ మోసాల గురించి, సైబర్ మోసాలగురించి 1930 కి డయల్ చేసి సమస్యలను చెప్పవచ్చని, ప్రత్యేకంగా మహిళలకు వారి సమస్యలను తెలియపరచుటకు 112 కి డయల్ చేయవచ్చని,మహిళలు ఇబ్బందికరమైన పరిస్థితుల్లో ఉన్నప్పుడు శక్తీ యాప్ ను ఉపయోగించి పోలీస్ ల సహకారం కోరవచ్చని, సైబర్ మోసాలకి బలికావద్దని, ఆన్లైన్ యాప్ ల ద్వారా లోన్స్ తీసుకోవద్దని, అపరిచితులకు ఓటీపీ లు, బ్యాంకు అకౌంట్ వివరాలు తెలియచేయకూడదని, ఎప్పుడైనా ఎక్కడైన ఇటువంటి మోసాలు జరిగితే వెంటనే పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని, ఆన్లైన్ మోసాల పట్ల అవగాహన కలిగి వుండాలన్నారు. ఈ కార్యక్రమానికి సి.ఐ డి. మల్లిఖార్జునరావు, ఎస్సై వినోద్ బాబు, సి.సి. లు సాల్మన్, సురేషు, చంద్రశేఖర్, వి.వో. ఏ.లులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిషన్ను నియమించాలి

- బహుజన టీచర్స్ అసోసియేషన్

**ఉలవపాడు, మార్చి 20, ప్రభాతవార్త**



ప్రభుత్వం వెంటనే 12వ పిఆర్సి కమిషన్ను నియమించి 30 ఐ ఆర్ ను ప్రకటించాలని కోరుతూ బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉలవపాడు ఎంఈఓ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. పెండింగ్ డీఏలను తక్షణమే ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలలో రోస్టర్ కం మెరిట్ ను అమలు చేయాలని, సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఎంఈఓ రమణయ్యకు వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మేడికొండ భాస్కర్, దార్ల కోటేశ్వరరావుఉలవపాడు మండల అధ్యక్షులు పున్నేపల్లి శ్రీను ,జిల్లా నాయకులు దన్నాసి శోభన్ బాబు, వెలిచెర్ల కోటేశ్వరరావుమహిళా కార్యదర్శి దాసరి వెంకటరత్నమ్మ, మండల నాయకులు పాలేటి సుబ్బారావు, దాసరి బాలయ్య, రిటైర్డ్ ఉపాధ్యాయులు సుదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.

# పేదలను ఆదుకోవడమే రంజాన్ పండుగ విశిష్టత

- టిడిపి రాష్ట్ర నేత పఠాన్ హనీఫ్ ఖాన్

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

నిరుపేదలైన తోటి వారికి సహాయం చేయడం వారిని ఆదుకోవడం, వారు కూడా రంజాన్ పండుగను సంతోషంగా కుటుంబ సమేతంగా జరుపుకోవడమే ఈద్‌ఉల్‌ఫితర్ (రంజాన్ పండుగ) విశిష్టత అని తెలుగుదేశం పార్టీ మైనారిటీ సెల్ రాష్ట్ర నాయకులు పఠాన్ హనీఫ్ ఖాన్ అన్నారు.ఒంగోలు గుంటూరు రోడ్ లోని ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ ఎకనామికల్ డెవలప్మెంట్ సొసైటీ సంఘ కార్యాలయంలో అధ్యక్షులు షేక్ ఖాదరవలి అధ్యక్షతన జరిగిన రంజాన్ తోఫా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా హనీఫ్ ఖాన్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఈ సంఘం ద్వారా నిరుపేదలైన వారికి ఆర్థికంగా వైద్య పరంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయం అన్నారు.ప్రతిభ గల విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో నిరుపేదలైన విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థిక సహకారాన్ని అందిస్తూ రేపటి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న సంఘంలోని ప్రతి ఒక్క సభ్యునికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు .తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం మైనార్టీ సంక్షేమానికి కట్టుబడి ఉందని అన్నారు.ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు నాయకత్వంలో ముస్లిం సామాజిక వర్గ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించి అనేక సమస్యలను పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ ఎకనామికల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు షేక్ ఖాదర్ వలీ మాట్లాడుతూ ముస్లిం సోదరమణులు రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఉద్దేశంతో పండుకు అవసరమైన నిత్యవసర వస్తువులతో పాటు ఒక చీర పంపిణీ కార్యక్రమం చేపట్టామని తెలిపారు.



ప్రకాశం

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు

- బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి

**మార్కాపురం, ప్రభాతవార్త**



ముస్లిం సోదర సోదరీమణులకు పవిత్ర రంజాన్ పండగ సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రంజాన్ మాసం ఇస్లాం మతంలో అత్యంత పవిత్రమైనది అని, ఈ నెలలో అల్లాహ్ దయ, కరుణలు విశేషంగా లభిస్తాయని పేర్కొన్నారు. ఈ పవిత్ర మాసంలో ముస్లింలు పాటించే ఉపవాస దీక్ష (సౌమ్) ద్వారా ఆత్మశుద్ధి, సహనం, నియంత్రణ, భక్తి మరింత పెరుగుతాయని తెలిపారు. పేదలు, నిరుపేదలకు సహాయం చేయడం ద్వారా సమానత్వం, సోదరభావం పెరుగుతుందని పేర్కొన్నారు. రంజాన్ ముగింపు సందర్భంగా జరుపుకునే ఈద్‌ఉల్‌ఫిత్ర్ పండుగ ఆనందం, ఐక్యత, ప్రేమకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రతి ఇంట్లో సంతోషాలు నిండాలని, అల్లాహ్ కరుణతో అందరికీ ఆరోగ్యం, శాంతి, శ్రేయస్సు కలగాలని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి ఆకాంక్షించారు.

# స్వచ్ఛ పథం.. కదలని రథం

## - కొత్త పథకానికి బాలరిష్టాలు

**ఒంగోలు, ప్రభాతవార్త**

గొప్ప ఆశయంతో ప్రారంభించిన స్వచ్ఛ రథాల పథకం బాలరిష్టాలు ఎదుర్కొంటుంది. త్రపి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా మార్చాలనే లక్ష్యంతో పథకం ప్రారంభించారు. గ్రామ, మండల స్థాయి అధికారులు కొందరు శ్రద్ధ చూపడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో రాష్ట్ర అధికారులు వీటి లక్ష్యాలను పూర్తి చేయలేకపోతున్నారు. వృథా వస్తువులు ఇస్తే ఇంటింటికి సరుకులు అందిస్తామనే నినాదంతో ఉమ్మడి ప్రకాశం జిల్లా వ్యాప్తంగా 38మండలాల కేంద్రాలకు స్వచ్ఛ రథం ఏర్పాటు చేయాలని సంకల్పంగా పెట్టుకోగా అది ఆచరణలో సాధ్యం కావడం లేదు. జనవరి 17న స్వచ్ఛ రథాలు రెండో విడత 21న మరో పది స్వచ్ఛ రథాలను ప్రారంభించారు. వాస్తవానికి ఫిబ్రవరి 25నాటికి జిల్లా వ్యాప్తంగా మండలానికి ఒకటి చొప్పున 38 మండలాల్లో ప్రారంభించాల్సి ఉన్నా పలు కారణాలతో లక్ష్యాలు నెరవేరలేదు. అధికారులు, ఉద్యోగులు గ్రామాల్లో ఇంటి పన్నులు వసూళ్లు, సర్వేలు సమావేశాల్లో సమీక్షల్లో ఉండడం, రథాల నిర్వహణకు నిరుద్యోగులు, డ్రైవర్లు ముందుకు రాకపోవడంతో పథకం పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. రథాలను పంపేందుకు ప్రస్తుతం మండలాన్ని ఒక యూనిట్‌గా తీసుకున్నారు. ఇదిలా ఉంటే పల్లెలను



స్వచ్ఛతగా తీర్చిదిద్దడానికి అడుగులు పడుతున్నాయి. గ్రామాల్లో ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణ ద్వారా పరిశుభ్రత పెంపొందించడంతో పాటు వర్మీ కంపోస్టు తయారు చేసి వాటి అమ్మకాలతో పంచాయతీలకు ఆదాయం సృష్టించాలనే ప్రభుత్వ ఉద్దేశం. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాఆ ప్రభుత్వం పంచాయతీ ఖాతాల నుంచి నిధులను వెనక్కి మళ్లించడమే కాకుండా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ ఆటకెక్కించింది. ఈ మేరకు తడి, పొడి చెత్త సేకరణతో పాటు హానీకర వ్యర్థాలను విడివిడిగా సేకరించాలనే లక్ష్యంగా ప్రణాళికను రూపొందించారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో వాడుక లేని కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చారు. తొలి విడతగా గత ఏడాది ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 118 పంచాయతీలకు ట్రాక్టర్లు ఇవ్వగా, తాజాగా ట్రక్కులను సరఫరా చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మొత్తం 925 గ్రామ పంచాయతీలు ఉండగా వీటిలో 710 గ్రామాల్లో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. పల్లెల్లో ప్రతి రోజు ఉదయాన్నే ఇంటి నుంచే చెత్త సేకరణ నిమిత్తం అద్దె ప్రాతిపదికన ట్రాక్టర్లు పెట్టుకున్నారు. ఇందుకు నెలకు పది వేలు రూపాయలు చెల్లిస్తుండడంతో చిన్న పంచాయతీలకు ఆర్థిక భారంగా మారింది. మరికొన్ని చోట్ల క్లాప్ మిత్రాల ఆధారంగా రిక్షాలతో సేకరిస్తుండడంతో నివాస ప్రాంతాలకు తరలించడంలో జాప్యం జరుగుతుంది. ఈ క్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నిధులతో ట్రాక్టర్లు మంజూరు చేశారు. తొలి విడతగా 118 పంచాయతీలకు ట్రాక్టర్లు కేటాయించగా నాలుగు కంపెనీల నుంచి వాటిని గ్రామాలకు సరఫరా చేశారు. అప్పట్నించి ట్రక్కులు మంజూరు చేయడంలో జాప్యం జరగడంతో ట్రాక్టర్లు అలంకార ప్రాయంగా మారాయి. ప్రస్తుతం ట్రక్కుల సరఫరా నేపథ్యంలో చెత్త సేకరణతో పాటు శివారు ప్రాంతాలకు చెత్త నిల్వల తరలింపు సులభతరం కానుంది.

### డ్రగ్స్, గంజాయి లాంటి మానక ద్రవ్యాలతో కుటుంబాలను..

# పిల్లల భవిష్యత్తును దుర్భల్యం చేసుకోకండి

- అద్దంకి రూరల్ సర్కిల్ సీ.ఐ. డి. మల్లికార్జున్

**జె. పంగులూరు, మార్చి 20, ప్రభాతవార్త**



డ్రగ్స్, గంజాయి లాంటి మానక ద్రవ్యాలు వ్యసనాలతో కుటుంబాలను బలి చేసుకోవద్దని, టూ వీలర్స్, కారు, ఆటో తదితర వాహనదారులు రోడ్డు భద్రత అంశాలపై అవగాహన కలిగి ఉండాలని అద్దంకి రూరల్ సర్కిల్ సీ.ఐ.డి. మల్లికార్జున్ అన్నారు. మండలంలోని కశ్యాపురం గ్రామ పల్లెలో అద్దంకి రూరల్ సర్కిల్ సీ.ఐ. డి. మల్లికార్జున్ ఆధ్వర్యంలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ ను గ్రామ ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. తొలుత గ్రామస్తులు మనోహరంగా ఏర్పడి డ్రగ్స్ వద్దు మీ జీవితాలను చిదివేస్తాయంటూ మంచి జీవితాలకే మా ఓటు అంటూ ప్రజలచే ప్రతిజ్ఞ చేయించి, గ్రామంలో ప్రజలు, సిబ్బందితో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సి.ఐ.డి. మల్లికార్జున్ మాట్లాడుతూ రేయింబవులు కష్టపడి సంపాదించిన సొమ్ముతో డ్రగ్స్, గంజాయి లాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఉపయోగించకుండా మీ కుటుంబాల అభివృద్ధికి, మీ పిల్లల పోషణకు, భవిష్యత్ తీర్చిదిద్దడానికి వినియోగించాలన్నారు. మానక ద్రవ్యాలకు బానిసలు కాకుండా సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. చెడు వ్యసనాలకు బానిసలై మద్యం సేవించిన మత్తులో ద్విచక్ర వాహనదారులు ప్రయాణాలు చేయరాదని, కుటుంబ యజమానులు ప్రమాదవశాత్తు కోల్పోయిన కుటుంబాలు రోడ్డున పడి పిల్లలు అనాథలై, దుర్భలమైన జీవితా అనుభవించాల్సి వస్తుందన్నారు. వాహనదారులు రోడ్డు భద్రతాపరమైన జాగ్రత్తలతో ప్రయాణికులను గమ్యాలను చేరాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు బండి పర్మిట్, పొల్యూషన్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితిని మించి ప్రయాణికులతో అతివేగంగా ప్రయాణించరాదన్నారు. ప్రతి వాహనాన్ని ఎప్పటికప్పుడు కండిషన్లో ఉంచుకోవాలన్నారు. ప్రజలకు మత్తు మద్యం సేవించి మద్యం సేవించిన మత్తులో ప్రయాణించరాదని కౌన్సిలింగ్ ఇచ్చారు సి.ఐ.డి. మల్లికార్జున్. తల్లిదండ్రులు పిల్లలకు, విద్యార్థులకు వాహనాలు ఇవ్వరాదని, అలా ఇస్తే చట్టపరమైన చర్యలు బాధ్యులవుతారు అన్నారు. ఈ కార్యక్రమంలో జై పంగులూరు ఎస్సై బి వినోద్ బాబు మేనమట్ల ఎస్సై, కొరిసపాడు ఎస్సై, కానిస్టేబుల్ దిలీప్, వెంకటేశ్వర్లు, మోషే, గ్రామ ప్రజలు, పెద్దలు పాల్గొన్నారు.

# రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన నేతలు

- మంత్రులు గొట్టిపాటి, డోలా, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల, మాజీ మంత్రులు బాలినేని, శిద్దా

**ఒంగోలు, ప్రభాతవార్త**



జిల్లా ప్రజలకు, ముస్లిం సోదరులకు ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, మాజీ మంత్రులు బాలినేని శ్రీనివాసరెడ్డి, శిద్దా రాఘవరావులు శుక్రవారం వేర్వేరు ప్రకటనలో రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు చేసే కఠోర ఉపవాస దీక్షలు, నమాజులతో శరీరాన్ని శుష్కింపచేయడం వలన అరిషడ్వర్గాలు నశించి ప్రశాంతత, ఆధ్యాత్మికత, మత సామరస్యం, సోదరభావం, దానగుణం, సహనం, సత్ప్రవర్తన పెంపొందుతాయి. ఈ మాసంలో స్వచ్ఛమైన మనస్సుతో అల్లా దయ- కరుణకు ప్రార్థనలు చేయడం, చేసిన పాపాలకు క్షమాపణ కోరడం, నరకం నుండి విముక్తి పొందుటకు అల్లాను ప్రార్థించడం వలన అల్లా విముక్తి కల్పిస్తారు. కావున, జిల్లాలోని ముస్లింలు ముఖ్యంగా పేదలకు దానాలు, ఉప వాస దీక్షలు, నమాజులతో రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకోవాలని కోరుచూ ముస్లిం సోదరులకు, ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ‘ఒకే దేశం- ఒకే గ్రిడ్- ఒకే ధర’ గాస్ లక్ష్యంపై మాగుంట ప్రశ్న

**ఒంగోలు, ప్రభాతవార్త**

దేశం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సహజ వాయువు(గాస్) కు సంబంధించి ‘ఒకే దేశం- ఒకే గ్రిడ్- ఒకే ధర’ లక్ష్యం ప్రస్తుత స్థితి, పైపు లైన్లు, లబ్దిదారులు, నిధులు, పరిధి పెంపు కార్యక్రమాల గురించి ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలలో ఒగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు అడిగిన ప్రశ్నకు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ సహాయక మంత్రి సురేష్ గోపి సమాధానమిస్తూ- ఒకే దేశం- ఒకే గ్రిడ్- ఒకే ధర గాస్ లక్ష్యంతో దేశ వ్యాప్తంగా సహజ వాయువు/ గాస్ రంగాన్ని ఏకీకృతం చేయడం ద్వారా సరసమైన సకాలంలో సరసమైన ధరకు గాస్ అందించవచ్చని, గాస్ పైపు లైన్లు నిర్మించుటకు, పెంచుటకు, నిర్వహించుటకు వివిధ సంస్థలు పెట్రోలియం, సహజ వాయువుల నియంత్రణ బోర్డు అనుమతులు ఇస్తుందని తెలిపారు. దేశం మొత్తంలో 43,238 కి.మీ పైపు లైన్లు నిర్మాణానికి బోర్డు అనుమతించగా, 2025 సెప్టెంబర్ నాటికి 25,923 కిమీ పూర్తయిందని తెలిపారు. ఈ లక్ష్య సాకారంతోమూడు ప్రాంతాలను రెండుకు తగ్గిస్తూ 01-04-2023 తేదీ నుండి బోర్డు వారు గ్రిడ్ సిస్టం కింద ఉన్న అన్ని పైపు లైన్లకు ఏకీకృత సుంకాన్ని నిర్ణయించిందని తెలిపారు. రూ.9,340 కోట్లతో ఏకీకృత పైపు లైన్ సుంకం కింద దేశం మత్తంలో 10 కంపెనీలు 27,334 కి.మీ నిడివిగల 19 పైపు లైన్లను నిర్వహిస్తుండగా, ఆంధ్రప్రదేశ్‌లో 4 కంపెనీలు 4,908 కి.మీ నిడివిగల 4 పైపు లైన్లను నిర్వహిస్తున్నాయని తెలిపారు. దేశంలో 31-12-2025 నాటికి 1,60,24,538 డొమెస్టిక్ కనెక్షన్లు, 8,538 స్టేషన్లు సంస్థలు అందించగా, ఆంధ్రప్రదేశ్‌లో 3,09,172 డొమెస్టిక్ కనెక్షన్లు, 267 స్టేషన్లతో పాటు 89 పారిశ్రామిక, 586 వాణిజ్య కనెక్షన్లు అందించబడ్డాయని కేంద్ర మంత్రి తెలియజేశారు.

# భీకర గాలి వాన.. నేలకొరిగిన వాణిజ్య పంటలు

**యర్రగొండపాలెం, మార్చి 20, ప్రభాతవార్త**

యర్రగొండపాలెం మండలంలోని మురారిపల్లి గ్రామంతో పాటు త్రిపురాంతకం మండలం వెల్లంపల్లి, లేళ్ళపల్లి గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాల్లో వడగండ్ల వానకు తీవ్ర గాలి తోడై ప్రకృతి బీభత్సం సృష్టించింది. సాయంత్రం ఒక్క సారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో వానతో పాటు భీకర గాలులు వీచడంతో పొలాలలోని పంటలు నేలకొరిగాయి. దాంతో చేతికి వచ్చిన పంటలను అతలాకుతలం చేశాయి. అకస్మాత్తుగా కురిసిన గాలివాన దెబ్బతో రైతులు తీవ్రంగా నష్టపోయిన పరిస్థితి ఏర్పడింది. రైతులు ఎంతో కష్టపడి సాగు చేసిన పంటలు నేలకొరిగాయి. ముఖ్యంగా భాగా పెరిగిన మొక్కజొన్న, బొప్పాయి, అరటి, మిర్చి వంటి వాణిజ్య పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పలు చోట్ల బొప్పాయి చెట్లు, అరటి చెట్లు నేలకొరిగాయి. ఏపుగా పెరిగిన మొక్కజొన్న పంటలు పూర్తిగా విరిగిపడి, పంట పొలాలు ధ్వంసమైపోయాయి. పంటలు కోతకు సిద్దంగా ఉన్న సమయంలో ఈ గాలివాన రావడంతో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. కొన్ని ప్రాంతాల్లో పొలాలు చూసి రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ఆరు గాలం కష్టపడి, అప్పులు చేసి మరి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీలకు వేలాది రూపాయలు ఖర్చు పెట్టిన రైతులు ఇప్పుడు పూర్తిగా దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. ఈ గాలి వాన వల్ల వచ్చిన నస్టాన్ని తాము భరించే స్థితిలో లేమని రైతులు లబోదిబో మంటున్నారు. ఇప్పటికే పెట్టుబడి భారంతో ఇబ్బందులు పడుతున్న తమకు ఈ ప్రకృతి విపత్తు మరింత కష్టాలను తెచ్చిపెట్టిందని వాపోతున్నారు. వ్యవసాయమే జీవనధారంగా వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్న కొన్ని కుటుంబాలకు ఈ ప్రకృతి విపత్తు పెద్ద దెబ్బగా మారిందని రైతులు చెబుతున్నారు. పంట నష్టం ఎంత మేరకు జరిగిందో అధికారులు వెంటనే క్షేత్ర స్థాయిలో పరిశీలించి, సమగ్రంగా అంచనా వేయాలని



రైతులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామాల్లో ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసిన, నష్టపరిహారం పక్రియను వేగవంతం చేయాలని కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి, గాలి వాన వల్ల నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని, అవసరమైన అదనపు సహాయం ప్రకటించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.





# నూతన వధూవరులకు కరణం ఆశీర్వాదం



**బల్లికురవ, మార్చి 20, ప్రభాతవార్త**
గుంటూరు నగరంలోని వీఏఆర్ గార్డెన్స్‌లో జరుగుతున్న రిటైర్డ్ అదనపు ఎస్పీ వాకా శ్రీరాంబాబు, వెంకటేశ్వరమ్మల కుమారుడు శ్రీనివాస ప్రదీప్, రూపశ్రీల వివాహం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ పార్లమెంట్ సభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట అద్దంకి కాంగ్రెస్ ఇన్‌చార్జి అడుసుమల్లి కిషోర్‌బాబు తదితరులు ఉన్నారు.

## పెద్దదోర్నాల ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి కాంపౌండ్ వాల్ నిర్మించండి

### - రాత్రి వేళలో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బందికి వైద్యం కలిగించండి



**పెద్దదోర్నాల, మార్చి 20, ప్రభాతవార్త**
పెద్దదోర్నాల ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక సౌకర్యాల లోపం తీవ్రంగా కనిపిస్తుంది. ప్రధానంగా ఆసుపత్రి చుట్టూ కాంపౌండ్ వాల్ లేకపోవడం వలన వైద్య సిబ్బంది రోగులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రి పరిసరాలు పూర్తిగా రక్షణ లేకుండా ఉండడంతో రాత్రి వేళల్లో వైద్య సిబ్బంది భయాందోళనలకు గురవుతున్నారు. విధులు నిర్వహించేందుకు అవసరమైన భద్రత లేకపోవడం వల్ల నిర్భయంగా పని చేయని పరిస్థితి నెలకొంది. ఇక కాంపౌండ్ లేకపోవడం కారణంగా ఆసుపత్రి ప్రాంగణాన్ని ఆటోలు, మినీ లారీలు, పార్కింగ్ స్థలాలుగా ఉపయోగిస్తున్నారు. దీంతో అత్యవసర సేవలకు వచ్చే అంబులెన్స్‌లకు, రోగుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఆసుపత్రి పరిసరాలలో అసౌకర్యం నెలకొనడంతో పాటు పరిశుభ్రత కూడా దెబ్బతింటోంది. దానికి ప్రజలు రోగులు ఆసుపత్రికి తగిన భద్రత కల్పించాలంటూ అధికారులను కోరుతున్నారు. వెంటనే కాంపౌండ్ వాల్‌ను నిర్మించి రాత్రి సమయాల్లో భద్రత ఏర్పాట్లు చేపట్టి వైద్య సిబ్బందికి ధైర్యం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆశిస్తున్నారు.

## పెద్దబొమ్మలాపురంలో అజల్స్ సంస్థ ఉచితంగా తాగునీటి సేవలు



**పెద్దదోర్నాల, మార్చి 20, ప్రభాతవార్త**
యర్రగొండపాలెం నియోజకవర్గంలో భూగర్భ జలాలు లేని గ్రామాలను ప్రభుత్వం గుర్తించింది. ఆయా గ్రామాలలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు అజల్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ట్యాంకర్ల ద్వారా ఉచితంగా నీటి సరఫరా చేపట్టే కార్యక్రమం గత రెండేళ్లుగా శ్రీకారం చుట్టింది. ఈ మేరకు పెద్దదోర్నాల మండలం పెద్దబొమ్మలాపురం తూర్పు పల్లి ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య ఎదుర్కొన్నట్లు సంస్థ నిర్వాహకులు కొతారి ప్రభుదాసు దృష్టికి రావడంతో శుక్రవారం ట్యాంకర్లతో ఉచిత తాగునీటి సరఫరా కార్యక్రమం చేపట్టారు. గూగుల్ కంపెనీ బెనివిటీ సంస్థ అందించిన నిధుల సహకారంతో ప్రజల దాహార్తి తీర్చేందుకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నట్లు అజల్స్ సంస్థ నిర్వాహకుడు కొతారి ప్రభుదాసు తెలిపారు. ప్రత్యేకంగా ఈ సేవ కార్యక్రమాన్ని సమన్వయం చేస్తున్న ప్రభుదాసు కృషి గ్రామస్తులు ప్రశంసలు పొందుతుంది. ట్యాంకర్ల ద్వారా శుద్ధమైన తాగునీరు అందించడంతో చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు అందరూ ఉపశమనం పొందుతున్నారు. తూర్పుపల్లె ఎస్సీ కాలనీలో నీటి కొరత కారణంగా ఇంత కాలం ఇబ్బందులు పడుతున్నామని, ప్రస్తుతం ఈ సేవల వల్ల కొంత ఊరట కలిగిందని స్థానికులు తెలిపారు. ఎటువంటి స్వార్థం లేకుండా ప్రజల కోసం సేవలందిస్తున్న ప్రభుదాసు వంటి వ్యక్తులు సమాజానికి ఆదర్శమని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. ఈ సేవా కార్యక్రమం కొనసాగాలని అజల్స్ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పెద్ద బొమ్మలాపురమే కాకుండా యర్రగొండపాలెం ప్రాంతంలో ఏ గ్రామంలో నీటి కొరత ఉన్న అజల్స్ సంస్థ మొబైల్ నెంబర్ 9959452342ను సంప్రదిస్తే ఉచితంగా ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామని అజల్స్ సంస్థ నిర్వాహకుడు కొటారి ప్రభుదాసు తెలిపారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ



**యర్రగొండపాలెం, మార్చి 20, ప్రభాతవార్త**
యర్రగొండపాలెంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ జరిగింది. యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ బాధ్యులు ఎరిక్షన్‌బాబు పాల్గొని ఆ చెక్కులను బాధితులకు అందించారు. పలు రకాల ఆరోగ్య సమస్యలతో ప్రైవేటు వైద్యశాలలో చికిత్సలు పొందిన వారు చికిత్సకు సంబంధించిన వివరాలు అందించి సహాయం కోరడంతో వారందరికి పట్టణంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 18 మందికి రూ.11,90,333 లక్షల విలువైన చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో బాధితులతో పాటు ఆ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# యర్రగొండపాలెంలో ప్రజాదర్బార్



**యర్రగొండపాలెం, మార్చి 20, ప్రభాతవార్త**
యర్రగొండపాలెం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రతి శుక్రవారంలో భాగంగా జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ బాధ్యులు ఎరిక్షన్‌బాబు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు పాల్గొని పలు సమస్యలపైన అర్జీలను అందించారు. యర్రగొండపాలెం మండలం ముస్లిం యూత్ సొసైటీ తరుపున పాల్గొన్న షేక్ ఇస్మాయిల్ మండలంలోని పలు ముస్లింల సమస్యలపై అర్జీల రూపంలో అందించారు.

# బీజేపీలో చేరిన ఇరవై కుటుంబాలు

**యర్రగొండపాలెం, మార్చి 20, ప్రభాతవార్త**
ఒంగోలులో జరిగిన ఓ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసరావు సమక్షంలో యర్రగొండపాలెం మండల బీజేపీ అధ్యక్షులు మాదాల సూర్యనారాయణ ఆధ్వర్యంలో యర్రగొండపాలెం మండలం గొళ్ళవిడిపి గ్రామానికి చెందిన పది కుటుంబాలు, రామచంద్రపురం గ్రామం నుంచి పది కుటుంబాలు బీజేపీలో చేరారు. వీరికి బీజేపీ జిల్లా అధ్యక్షులు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రధాని నరేంద్ర మోడీ పరిపాలనకు ఆకర్షితులై బీజేపీ పార్టీలో చేరడం జరిగిందని తెలిపారు. వారి గ్రామాల్లో బీజేపీ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరక్టర్ నక్కా వెంకటేశ్వర్లు, బీజేపీ మండల మహిళా అధ్యక్షురాలు చెన్నబోయిన రమణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మార్కాపురం రైల్వే స్టేషన్‌లో ఉగాది అన్నదానం ప్రారంభం

### - జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు చేతుల మీదుగా సేవా కార్యక్రమాలకు శ్రీకారం



**మార్కాపురం, మార్చి 20, ప్రభాతవార్త**
ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మార్కాపురం ఉగాది అన్నదాన సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీశైలం నుంచి కర్ణాటకకు వెళుతున్న భక్తులకు ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమాన్ని మార్కాపురం రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్, తాగునీటి సదుపాయాలను కూడా జేసీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతోషకరమని తెలిపారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం ద్వారా నిజమైన ఆనందం పొందవచ్చని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, సుమారు 10వేల మంది భక్తులకు భోజన ఏర్పాట్లు చేసినట్లు జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఉగాది అన్నదాన సేవా సంఘం సభ్యులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అంచనా వేయాలి

### - ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దగ్గుపాటి సోమయ్య



**మార్కాపురం, మార్చి 20, ప్రభాతవార్త**
గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల వల్ల జిల్లాలోని పలు మండలాల్లో పంటలుతీవ్రంగాదెబ్బతిన్నాయని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు దగ్గుపాటి సోమయ్యతెలిపారు. ముఖ్యంగా మొక్కజొన్న ,మిరప, అరటి, బొప్పాయి, పొగాకు, వరి పంటలు భారీ నష్టాన్ని చవిచూశాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోవెంటనే అధికారులు పంటనష్టంపై సమగ్ర అంచనాలు రూపొందించి, నష్టపోయిన రైతులకు తగిన నష్టపరిహారం అందించాలన్నారు. రైతులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. మార్కాపురం ఆర్డీఓ కార్యాలయం ద్వారా శుక్రవారం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్‌నాయకులు గాలి వెంకట రామిరెడ్డి, మార్కాపురం మండల రైతు సంఘం కార్యదర్శి గంగిరెడ్డి రాజశేఖరరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు రేపని తిరుపతయ్య, మార్కాపురం రైతు సంఘం నాయకులు బొగ్గు రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం భక్తులకు అన్నదాన కార్యక్రమం ప్రారంభించిన ఎమ్మెల్యే కందుల



**మార్కాపురం, మార్చి 20, ప్రభాతవార్త**
ఉగాది మహోత్సవాల సందర్భంగా శ్రీశైలం దర్శనానికి వెళ్లి తిరిగి ప్రయాణం చేస్తున్న భక్తులకు మార్కాపురం రైల్వే స్టేషన్ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. దాతల సహకారంతో నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమంలో భక్తులకు భోజన వసతులు కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తులకు సేవ చేయడం పుణ్యకార్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, రాష్ట్ర టిడిపి నాయకుడు మస్తానయ్యతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించిన దాతలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మార్కాపురంలో డివిస్ ల్యాబ్స్ ప్లేస్మెంట్ డ్రైవ్

### - ఫార్మసీ, సైన్స్, ఇంజినీరింగ్ అభ్యర్థులకు అవకాశం

**మార్కాపురం, మార్చి 20, ప్రభాతవార్త**
స్థానిక డాక్టర్ సామ్యూల్ జార్జ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో ఈ నెల 21వ తేదీ (శనివారం) ఉదయం 9:30 గంటలకు ప్రముఖ ఔషధ సంస్థ డివిస్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నారు. ఈ డ్రైవ్‌కు బి.ఫార్మసీ, ఎంఫార్మసీ, బీఎస్‌సి, ఎంఎస్‌సి, బిటెక్ (కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ) వంటి విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు హాజరు కావచ్చని నిర్వాహకులు తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు తమతోపాటు తాజా రెజ్యూమ్, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులు, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. పూర్తి వివరాలకు 7093281133నంబర్ నందు సంప్రదించవలేనని నిర్వాహకులు తెలిపారు.

## రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు



**మార్కాపురం, మార్చి 20, ప్రభాతవార్త**
రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఉమ్మడి ప్రకాశం జిల్లా ముస్లిం సోదర, సోదరీమణులకు జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని, ఈ కాలంలో ముస్లింలు నియమనిష్ఠలతో ఉపవాసాలు పాటిస్తూ, దైవ ప్రార్థనలు నిర్వహిస్తూ, పేదలకు సహాయం చేస్తూ భక్తి శ్రద్ధలతో గడుపుతారని అన్నారు. త్యాగం, సేవా భావం, పవిత్రతలకు ప్రతీక అయిన రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకోవాలని, అందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అల్లాహ్ కృపా కటాక్షాలతో ప్రతి కుటుంబంలో ఆనందం, శాంతి నెలకొనాలని అభిలషించారు. రంజాన్ సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు. భద్రతా చర్యలు కట్టుదిట్టం చేయడంతో పాటు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని అధికారులకు సూచించారు.

# సమస్యలపై చర్చించిన వైసీపీ ఇన్‌చార్జి



**కందుకూరు మార్చి 20, ప్రభాతవార్త**
కందుకూరు వైసీపీ కార్యాలయంలో శుక్రవారం కార్యకర్తలు నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో స్థానిక వైసీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామ కమిటీలు పై పనితీరుపై సమీక్షించారు. ప్రజల వైసీపీ అభిమానుల కష్టసుఖాలలో అండగా ఉండాలని కమిటీలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం కందుకూరు మండలం కమ్మవారిపాలెంలో ఇటీవల మరణించిన బూత్ కమిటీ అధ్యక్షులు పోకూరి వెంకటేశ్వర్లు వారి ఇంటికి వెళ్లి ఆయన తండ్రి పోకూరి బాలకోటయ్యని పరామర్శించారు. అదేవిదంగా కందుకూరు టౌన్ ఆదిఆంధ్ర కాలానిలో అనారోగ్యంతో మృతిచెందిన సీనియర్ నాయకుడు కుడుముల మాలకొండయ్య ఇంటికి వెళ్లి ఆయనకి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు కందుకూరు టౌన్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# యువతకు ఉద్యోగ కల్పనకు చంద్రబాబు కృషి

### - సీఎం రిలీఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే





**కందుకూరు మార్చి 20, ప్రభాతవార్త**
రాష్ట్రంలో యువతకు ఉద్యోగ ఉపాధికల్పనకు ముఖ్యమంత్రి చంద్రబాబు అవిరళ కృషిచేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఇందులో బాగంగా గత 20 నెలల్లో 6.28 లక్షల ఉద్యోగావకాశాలు లబించాయన్నారు. 23లక్షల కోట్ల పెట్టుబడితో 25 లక్షల ఉద్యోగ అవకాశాలు సృష్టించే కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని ఆయన వివరించారు. తాజాగా పదివేలకు పైగా పోస్టుల కోసం జాబ్ క్యాలెండర్ విడుదల చేసిందని తెలిపారు. శుకృవారం స్థానిక తెదేపా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన పలు విషయాలు వెల్లడించారు. సీఎం రిలీఫ్‌పండ్, స్త్రీ శక్తి, దివ్యాంగుల శక్తి, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు లాంటి పథకాలు ప్రజలకు మేలు చేకూరుస్తున్నట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వ నిరంకుశపాలనతో రాష్ట్రం తిరోగమనంలోకెళ్లిందన్నారు. ప్రస్తుతం చంద్రబాబు పరిజ్ఞానంతో రాష్ట్రం పారిశ్రామికాభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందన్నారు. ఇందులో బాగంగా కందుకూరు నియోజకవర్గం బిపిసిఎల్, ఇండోసోల్‌కంపెనీలు, రామాయపట్నం పోర్టుతో పారిశ్రామికీకరణ దిశగా పయనిస్తుందన్నారు. రోడ్ల నిర్మాణం, తాగునీటి వసతులు ఏర్పాటుకు కోట్లాదిరూపాయలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. వలేటివారిపాలెం మండలం అయ్యవారిపల్లి వద్ద 100ఎకరాల్లో ఎమ్మెస్మె పార్క్ రాబోతోందన్నారు.

### బాధితులుకు అండగా సీఎం రిలీప్ పండ్ :

### - ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

ముఖ్యమంత్రి సహాయనిధి పథకం అనారోగులపాలిట కల్పవృక్షమని స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. గత 20నెలల కాలంలో కందుకూరునియోజవర్గంకు ఈ పథకంకింద 33దశలులో 1245 మంది రూ.9.96 కోట్ల లబ్దిపొందారని ఆయన వివరించారు. శుకృవారం స్థానిక తెదేపా కార్యాలయంలో సీఎం రిలీఫ్ పండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. కందుకూరు రూరల్ మరియు పట్టణ ప్రాంతంలోని 33మంది లబ్దిదారులకు తాజాగా రూ.14.39లక్షలు విలువైన చెక్కులను ఆయన అందచేశారు. ఇందుకు సహకరిస్తున్న సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల పార్టీఅధ్యక్షులు మాదాల లక్ష్మినరసింహం, జనిగర్ల నాగరాజు, బుస్సా రెడ్డి కృష్ణారెడ్డి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, ముస్లిం మైనారిటీ సెల్ ప్రతినిధి షేక్ రఫీ, యువత అధికార ప్రతినిధి బెజవాడ ప్రసాద్, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు అల్లం వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు చిరంజీవిరెడ్డి, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీడీవో కార్యాలయ ఆకస్మిక తనిఖీ

### - పీ4 విబాగం పనితీరుపై ఆరా - ఎమ్మెల్యే



**కందుకూరు మార్చి 20, ప్రభాతవార్త**
కందుకూరు ఎంపీడీవో కార్యాలయాన్ని శుకృవారం స్థానికఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సందర్శించారు. ఇందులోని పీ4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్ట్నర్ షిప్) విబాగాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది విధులు, పనితీరును పరిశీలించారు. గ్రామాల వారీగా పేదలు గుర్తింపు, వివిద గ్రామాల్లో నెలకొన్న సమస్యల సేకరణ తదితర వివరాలను ఆరా తీశారు. ఏడాదికాలంలో ఆయా గ్రామాల అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళిల వివరాలేవన్నారు. గ్రామాలలో జీవనాధారం లేని నిరుపేదలతో పాటు తల్లిదండ్రులు లేని పిల్లలు, ఒంటరి వృద్ధుల సమాచారాన్ని సేకరించాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఆదేశించారు. ఇందుకు అర్హులకు పీ4 పద్దతిలో ప్రభుత్వం, దాతల సహాయం అందేటట్లుగా పనిచేయాలని ఎమ్మెల్యే ఇంటూరి సూచించారు.

### మౌళిక సమస్యలు గుర్తించండి

గ్రామాలలో ప్రజల మౌళికసమస్యలైన అంతర్గతరోడ్లు, లింకు రోడ్డు, డొంక రోడ్లు, స్మశానాలు తదితర మౌళికవసతుల మెరుగుపరుచుటకు లేదా ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు తయారుచేయాలని ఎమ్మెల్యే ఇంటూరి సిబ్బందికి సూచించారు. ప్రజల అవసరాలేంటో సర్వేచేయాలన్నారు. తద్వారా పనులు చేపడతామన్నారు. పీ4సర్వే వివరాలను పలువురు పంచాయతీకార్యదర్శులు సకాలంలో కార్యాలయానికి ఇవ్వడంలేదని పలువురు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఎమ్మెల్యేకి పిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే సదరు సిబ్బందిని మందలించారు. తగిన సమాచారం ఖచ్చితంగా ఇవ్వాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఇంటి పన్నురికవరీలో మోపాడు, మాచవరం, కొండికందుకూరు, నరిశెట్టివారిపాలెం వెనుక బడ్డాయన్నారు. బకాయిలు అదికంగా ఉందన్నారు. ఇందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సంబందిత అధికారులకు సూచించారు.

# బిఆర్ ఆక్స్‌పర్డ్‌లో రంజాన్ వేడుకలు



**కందుకూరు మార్చి 20, ప్రభాతవార్త**
కందుకూరుపట్టణంలోని పామూరు రోడ్డులోని బిఆర్‌ఆక్స్‌ఫర్డ్ ఒలంపియాడ్ పాఠశాలలో ముందస్తు రంజాన్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముస్లిం విద్యార్థులు మత పెద్ద సమక్షంలో ఖురాన్ పఠనం చేశారు. తదుపరి మిఠాయిలు, హలీం పంచిపెట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బి.ఆర్ ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం ఆత్మ నిగ్రహం, దానధర్మాలు, భక్తికి నిదర్శనం అన్నారు. విద్యాసంస్థల డైరెక్టర్ జి.బాలభాస్కరరావు మాట్లాడుతూ రంజాన్ శాంతి, సోదరభావం, క్షమాగుణం, సహనాన్ని బోధిస్తుందన్నారు. మనుషులంతా ఈ సద్గుణాలను అలవర్చుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్ బెజవాడనరేంద్రబాబు, పాఠశాల డీన్, ప్రిన్సిపాల్స్ ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



**మార్కాపురం టౌన్, మార్చి 20, ప్రభాతవార్త**
మార్కాపురం మండలంలోని ఇడుపూరు గ్రామ శివార్లలో సంకుల మల్లయ్య (40) అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరిన మల్లయ్య గ్రామ సమీపంలోని ఆంజనేయస్వామిగుడి వెనుక చెట్టుకు ఉరివేసుకుని విగతజీవిగా కనిపించాడు. సమీపంలో ఉన్న బాలుడు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, వారు అక్కడికి చేరుకుని గ్రామానికి తరలించినప్పటికీ అప్పటికే మల్లయ్య మృతి చెందినట్లు తెలిసింది. మృతుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ ఉండేవాడని, సౌమ్య స్వభావం గల వ్యక్తి అని గ్రామస్తులు తెలిపారు. ఉదయాన్నే పని ఉందని బయటకు వెళ్లిన మల్లయ్య ఇలా మృతిచెందడం అనుమానాస్పదమని పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి రూరల్ ఎస్.ఐ. వి.వేమన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# అకాల వర్షం దెబ్బకు నేలపాలైన మిర్చి పంట

### - కన్నీరుమున్నీరవుతున్న రైతులు



**హనుమంతునిపాడు, మార్చి 20, ప్రభాతవార్త**
మండలంలోని హనుమంతపురం పంచాయతీ నారేపల్లి, రంగంపేట గ్రామాలలో కురిసిన అకాల వడగండ్ల వర్షానికి ఆ గ్రామాలకు చెందిన పిక్కిలి పోలయ్య, బాల కేశవులు, బుడ్డారెడ్డి సహా మరో ఏడుగురు రైతులు సాగు చేసిన మిర్చి పంట కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో ఈ విపత్తు సంభవించింది. వడగండ్ల దెబ్బకు మిర్చి కాయలు రాలిపోయి, మొక్కలు విరిగి నేలమట్టమయ్యాయి. సుమారు 80 లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో కష్టపడి, పెట్టుబడులు పెట్టి పండించిన పంట కళ్లముందే నాశనం కావడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. రెక్కలు ముక్కలు చేసుకుని సాగు చేశాం, ఇప్పుడు పెట్టుబడి కూడా వచ్చేలా లేదని, అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదని బాధితులు వాపోతున్నారు. నష్టపోయిన తమను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.





మండు వేసవిలో కాసిని నీళ్లు కనిపించడంతో ఈ బాతులకు ఎంత సంబరమో.. మండలంలోని నాగం బొట్ల పాలెం గ్రామంలో ఎన్ ఎస్పీ కాల్వలో మధ్యాహ్నం బాతులు ఇలా సేదతీరుతుండగా ప్రభాతవార్త కెమెరా క్లిక్ మనిపించింది.
తాళ్లూరు,ప్రభాతవార్త

# డీపీవో వెంకటేశ్వరరావు వెల్లడి

## - ఉమ్మడి జిల్లాలో రూ.34 కోట్ల మేరకు హౌస్ టాక్స్ తదితర పన్నులు వసూళ్లు



**సంతనూతలపాడు, మార్చి 20, ప్రభాతవార్త**
ఉమ్మడి ప్రకాశం, మార్కాపురం జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి నేటి వరకు 34 కోట్ల పదిలక్షల రూపాయలు మేరకు హౌస్ టాక్స్, తదితర పన్నులు వసూళ్లు అయినట్లు ఉమ్మడి జిల్లాల పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సంతనూతలపాడులో హౌస్ టాక్స్ కలెక్షన్‌కు సంబంధించి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని శుక్రవారం నాడు డీపీవో వెంకటేశ్వరరావు, రాష్ట్ర స్వర్ణ పంచాయతీల నోడల్ ఆఫీసర్ ఆర్.నాగేంద్ర ప్రసాద్‌లు పరిశీలించి అనంతరం సంతనూతలపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో 925 గ్రామ పంచాయతీలకు సంబంధించి 52 కోట్ల 30 లక్షల రూపాయలు మేరకు టార్గెట్ కలదన్నట్టు డీపీవో వెంకటేశ్వరరావు వెల్లడించారు. మరొక 18 కోట్ల రూపాయలు మేరకు ఈ నెల 31వ తేదీ లోపు ఆయా గ్రామ పంచాయతీలో అన్ని రంగాల్లో గల సిబ్బంది విధిగా పని చేసే ఈ హౌస్ టాక్స్ కలెక్షన్‌ను వసూళ్లు చేయాలన్నారు. మైనంపాడు, గ్రామ పంచాయతీ నందు 11 లక్షల గాను ఆరు లక్షల రూపాయలు వసూలైనట్లు ఎంపీడీవో సురేష్‌బాబు వెల్లడించారు. మేజర్ పంచాయతీ అయిన సంతనూతలపాడులో 92 లక్షలు రూపాయలు గాను55 లక్షల రూపాయలు ఈ మేరకు హౌస్ టాక్స్ వసూళ్లు అయినట్టు సంతనూతలపాడు గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి ఆర్.శ్రీనివాసులు ఈ సందర్భంగా డీపీవో వెంకటేశ్వరరావుకు వివరించారు. ఉమ్మడి జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీలలో నూరు శాతం మేరకు హౌస్ టాక్స్‌ను తప్పనిసరిగా సచివాలయం సిబ్బంది వసూళులన చేయాలని డీపీవో వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంతనూతలపాడులో శుక్రవారం నాడు 43 వేల 670 రూపాయలు హౌస్ టాక్స్ వసూళ్లు కాగా వాటిపై ఆన్‌లైన్ రసీదులను డీపీవో వెంకటేశ్వరరావు, రాష్ట్ర స్వర్ణ పంచాయతీల నోడల్ ఆఫీసర్ ఆర్‌నాగేంద్ర ప్రసాద్, ఎంపీడీవో డి.సురేష్ బాబులు గృహస్థులకు పంపిణీ చేశారు. భాగా తక్కువ వసూళ్లు కావడం పట్ల డీపీవో వెంకటేశ్వరరావు దీనిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్ బకాయిలు, రెగ్యులర్ హౌస్ టాక్స్ వసూళ్లపై సచివాలయం సిబ్బంది మరింతగా నడుం బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు పి.రవికుమార్, యు.అరుణ కుమారి, సంతనూతలపాడు గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి ఆర్.శ్రీనివాసులు, బిల్ కలెక్టర్ పి.బాబురావు, జూనియర్ అసిస్టెంట్ వై.మణి, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో ఉగాది కానుకగా యువతకు 20 లక్షల ఉద్యోగ అవకాశాలకు ప్రత్యేక ప్రణాళిక

## - సంతనూతలపాడు శాసనసభ్యులు విజయ్‌కుమార్ వెల్లడి



**సంతనూతలపాడు, మార్చి 20, ప్రభాతవార్త**
ఉగాది కనుకగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనకు నడుం బిగించినట్టు సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ పేర్కొన్నారు. ఒంగోలులోని తన కార్యాలయంలో శుక్రవారం నదు జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడారు. ఉగాది జాబ్ క్యాలెండర్ నిరుద్యోగులకు ఆశాకిరణం అని ఎమ్మెల్యే విజయ్ కుమార్ వెల్లడించారు. నాటి యువగళంలో ఇచ్చిన మాట ప్రకారం నేడు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉగాది రోజున జాబ్ క్యాలెండర్‌ను విడదల చేసిన రాష్ట్ర ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేష్‌బాబుకు ఎమ్మెల్యే విజయ్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ పారిశ్రామిక వృద్ధితో ఉద్యోగాలు లభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రాబోయే 20 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాలు సృష్టించడమే లక్ష్యంగా కార్యచరణ చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకు 20 నెలల్లోనే 6,28,347 ఉద్యోగాలు కల్పించడం జరిగిందని తెలిపారు. టీడీపీ పాలనలో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులతో 25 లక్షల ఉద్యోగ అవకాశాలు సృష్టించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్, పారిశ్రామిక వృద్ధి ద్వారా యువతకు విస్తృత అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. జాబ్ క్యాలెండర్ ద్వారా ప్రతి సంవత్సరం నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. విద్య, పారిశ్రామిక రంగాల్లో పెట్టుబడులు పెంపుతో యువతకు శిక్షణ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని వివరించారు. ప్రభుత్వ విధానాల ఫలితంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు విస్తరిస్తున్నాయని తెలిపారు. హైటెక్ రంగాల్లో కొత్త అవకాశాలు సృష్టిస్తూ యువతను ప్రోత్సహిస్తున్నట్లు ఎమ్మెల్యే విజయ్ కుమార్ తెలిపారు. సంతనూతలపాడు నియోజకవర్గ అభివృద్ధికి ముమ్మరంగా కట్టుబడి పని చేస్తూ ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలను మరింతగా వేగవంతం చేయనున్నట్లు ఎమ్మెల్యే విజయ్ కుమార్ వెల్లడించారు.

# సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలి



**సంతనూతలపాడు, మార్చి 20, ప్రభాతవార్త**
సమాజంలో ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని సంతనూతలపాడు ఎస్సై అజయ్‌బాబు కోరారు. సంతనూతలపాడులోని సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో శుక్రవారం నాడు ఒంగోలు గౌతమ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఆర్బిఐ ఫైనాన్స్ సపోర్టుతో ఏర్పాటు చేసిన డిపాజిట్స్ ఎడ్యుకేషన్ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని అనంతరం ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ఒంగోలు గౌతమ్ ఫౌండేషన్ ఏపీడీఏపీడీఎన్ ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఫోన్ ద్వారా ఎవరికి ఓటీపీ చెప్పరాదని ఎస్సై అజయ్‌బాబు పేర్కొన్నారు. అంతే కాకుండా ఆన్‌లైన్ లింకులు ఓపెన్ చేయరాదని అన్నారు. బ్యాంకు అకౌంట్ నందు నగదు ఉంటే తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. నేడు సమాజంలో ఈజీ మనీ కొరకు చాలా మంది ఆశపడుతున్నారని ఎస్సై పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ వల్ల ఉద్యోగులు నిరుద్యోగులు తరచూ మోసపోతున్నారని ఆయన వెల్లడించారు. ప్రతి ఒక్కరూ వీటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ బ్యాంకు సేవలను ఉపయోగించుకోవాలని గౌతమ్ ఫౌండేషన్ ఏపీడీ ప్రసాద్ కోరారు. బ్యాంకు డిపాజిట్స్ లోన్స్, నామినేషన్ పక్రియ, సబ్సిడీ లోన్స్, బ్యాంకు అందించే సేవలపై ప్రసాద్ సందర్భంగా పేర్కొన్నారు. రిసోర్స్ పర్సన్స్ సాయి, ప్రవీణ్ కుమార్, శ్రీనివాసులు, బ్యాంకులు అందించే సేవలపై మహిళలకు, గ్రూపు సభ్యులకు, ప్రజలకు వివరించారు. ఈ సమావేశంలో సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్టు వైస్ చైర్మన్ పావులూరి నారాయణ స్వామి చౌదరి, ట్రస్టు సెక్రటరీ చివుకుల రాంగోపాల్, ట్రస్టు సభ్యులు ఆర్.జార్జి, ఒంగోలు గౌతమ్ ఫౌండేషన్ సిబ్బంది, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# దెబ్బతిన్న పొట్టిశ్రీరాములు, గాంధీ విగ్రహాలకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మరమ్మత్తులు



**సంతనూతలపాడు, మార్చి 20, ప్రభాతవార్త**
సంతనూతలపాడులోని బస్టాండ్ సెంటర్లో ఇటీవల జరిగిన ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని విగ్రహాల దిమ్మెలు పగిలిపోయాయి. దీనిపై పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిలిచిపోయాయి. దీంతో సంతనూతలపాడు ఎస్సై అజయ్‌బాబు ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ పర్యవేక్షణలో స్వచ్చందంగా విగ్రహాలకు మరమ్మత్తులు చేపట్టారు. సంతనూతలపాడు గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి ఆర్.శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ వై.మణి విగ్రహ నిర్మాణ పనులను చేపట్టారు. ముఖ్యంగా బేల్దారి నిర్మాణ పనులు, పెయింటింగ్ పనులు చేపట్టారు. గ్రామస్తులు పోలీసు శాఖ, గ్రామ పంచాయతీ ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.

## ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడులు నివారించాలని కోరుతూ నిరసన

**సంతనూతలపాడు, మార్చి 20, ప్రభాతవార్త**
ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడులు నివారించాలని కోరుతూ శుక్రవారం నాడు సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట నగర పాలక సంస్థ పరిధిలోని మర్రిచెట్లకాలనీ వద్ద శుక్రవారం నాడు ఇండిపెండెంట్ లేబర్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇండిపెండెంట్ లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సుందరం ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ దాడుల వల్ల నేడు160 మంది విద్యార్థులు వేలాది మంది పౌరులు మరణించారని సుందరం వెల్లడించారు. దేశంలో శాంతిని నెలకొల్పాలన్నారు. యుద్ధం వల్ల భారతదేశంలో వంట గ్యాస్ లభించగా, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సుందరం ఆరోపించారు. దేశంలో భారత్ ప్రభుత్వం యుద్ధం ఆగేందుకు తగు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కట్ట వరప్రసాద్, జిల్లా కార్యదర్శి దాసరి సంగీతరావు, ఐఎల్‌పీ ప్రతినిధులు, దాసరి సంగీతరావు, ప్రతినిధులు పోతయ్య, బాబు,కోటమ్మ,కోటేశ్వరమ్మ, వెంకాయమ్మ,అంకమ్మ, సుబ్బరావమ్మ, పలువురు మహిళలు పాల్గొన్నారు.




# పంచాయతీకార్మికులకు హెచ్ఐవీపై అవగాహన సదస్సు



**సంతనూతలపాడు, మార్చి 20, ప్రభాతవార్త**
సంతనూతలపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నాడు గ్రో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులకు హెచ్ఐవీపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రో స్వచ్ఛంద సంస్థ ఒంగోలు పీడీ బీడీ ఎస్ ప్రసాద్‌రావు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమాన్ని ఓఆర్‌డబ్ల్యూఆర్ భవాని పర్యవేక్షించారు. ప్రధానంగా నాలుగు మార్గాల ద్వారా హెచ్ఐవీ వస్తుందని ప్రాజెక్టులు పీడీ ప్రసాదరావు పేర్కొన్నారు. సూదులు చిరంజీలు, ద్వారా అదే విధంగా తల్లి నుండి బిడ్డకు రక్త మార్పిడి ద్వారా లైంగిక సంపర్కం ద్వారా అధికంగా హెచ్ఐవీ వస్తున్నట్లు ప్రసాదరావు వెల్లడించారు. హెచ్ఐవీ పట్ల ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఇది అంటూ వ్యాధి కాదని అంటించుకుంటే వచ్చే వ్యాధి అని ప్రసాదరావు తెలిపారు. ప్రతి ఒక్కరూ మంచి ఆరోగ్యాన్ని అలవర్చుకోవాలని సంతనూతలపాడు పంచాయతీ అభివృద్ధి అధికారి ఆర్.శ్రీనివాసులు తన ప్రసంగంలో కోరారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు సెక్రటరీ ఆర్.శ్రీనివాసులు, పంచాయతీ బిల్ కలెక్టర్ పి.బాబురావు, జూనియర్ అసిస్టెంట్ వై.మణి, ప్రాజెక్టు ఏఎన్ఎం సింగమ్మ, ప్రాజెక్టు సెక్రటరీ ఆర్.శ్రీనివాసరావు, ఓఆర్‌డబ్ల్యూఎం వెంకటరావు, ఆర్.భవాని, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

## - టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి



**హనుమంతునిపాడు, మార్చి 20, ప్రభాతవార్త**
పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా పట్టణంలోని ముస్లిం సోదరులకు టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ రంజాన్ మాసం ఉపవాసం, ప్రార్ధనలు, దానం, సేవ భావనలను పెంపొందించే పవిత్ర కాలమని అన్నారు. ఈ నెలలో ముస్లిం సోదరులు నియమ నిష్టలతో ఉపవాస దీక్షలు పాటిస్తూ సమాజానికి ఐక్యత, సహనం, సోదరాభృత్వం సందేశం ఇస్తారని తెలిపారు. రంజాన్ పండుగ ప్రతి ఇంటా ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం నింపాలని ఆకాంక్షించారు. సమాజంలో శాంతి, సఖ్యత నెలకొని అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ ముస్లిం సోదరులందరికి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**సీఎస్‌పురం, మార్చి 20, ప్రభాతవార్త**
గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం పార్టీ రేగులచెలక శాఖ కార్యదర్శి కలివెల థామస్ కోరారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్యకు శుక్రవారం అర్జీ అందజేశారు. గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలలో డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులు తీర్చాలని, అలాగే ఎస్సీ కాలనీలో దక్షిణ వైపు ఉన్న కొన్ని గృహాల వారికి కొళాయిలు నీరు రావడం లేదని ఆ ప్రాంతంలో ఓ బోరు వేసి మోటారు బిగించడం ద్వారా అక్కడి ప్రజల నీటి సమస్యను పరిష్కరించాలని, నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు విద్యుత్ లైట్లు వేయించాలని, ఎస్సీల స్మశాన స్థలంలో చెట్లను తొలగించాలని, ఎస్సీల స్మశానం వరద నీటిలో మునిగిపోకుండా ఒక వైపు కాలువ తీసి నీటిని కిందకు మళ్లించే ఏర్పాటు చేయాలని ఆ అర్జీలో పేర్కొన్నారు.

# పంటలకు ప్రభుత్వం నిర్ణయించిన ధర రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలి

**సీఎస్‌పురం, మార్చి 20, ప్రభాతవార్త**
రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధర మొత్తం రైతులకు అందేలా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కన్వీనర్ ఊసా వెంకటేశ్వర్లు కోరారు. ప్రస్తుతం రైతులు పండించిన కందులకు ప్రభుత్వం మద్దతు ధరను రూ.8వేలుగా నిర్ణయించి రైతుల వద్ద నుంచి కందులు కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. అయితే రైతులకు మద్దతు ధర రూ.8వేలు చెల్లిస్తున్న దాఖలాలు లేవన్నారు. హమాలీల ఖర్చులు పేరుతో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలో కోత విధిస్తున్నట్లు పలువురు రైతులు తమ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. దీనిపై అధికారులు దృష్టి సారించి హమాలీల ఖర్చులను ప్రభుత్వమే భరించేలా చర్యలు చేపట్టి ప్రభుత్వం ప్రకటించి మద్దతు ధర రూ.8వేలు మొత్తం రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# పేదలకు ప్రాణదాతగా సీఎం సహాయనిధి

## - ఎమ్మెల్యే ఏలూరి చొరువతో ముగ్గురికి అత్యవసర వైద్య సహాయం



**మార్టూరు, మార్చి 20, ప్రభాతవార్త**
తీవ్ర అనారోగ్య సమస్యలతో ఆసుపత్రుల్లో చికిత్స కోసం ఎదురు చూస్తున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ప్రాణధారం గా నిలిచింది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరువతో పర్చూరు, ఇంకొల్లు మండలాలకు చెందిన ముగ్గురు బాధితులకు అత్యవసర వైద్య చికిత్స కోసం లక్షల రూపాయల ఆర్థిక సహాయం ఎల్ఓసీ రూపంలో మంజూరైంది. పర్చూరు మండలం పోతుకట్ల గ్రామానికి చెందిన యనమదల రజిని(46) కాలికి తీవ్ర గాయం కావడంతో ఆరోగ్య పరిస్థితి విషమించింది. రోజు వారీ కూలి పనులు చేసి జీవనం సాగిస్తున్న ఆమె భర్త శివనాగేశ్వరరావుకు చికిత్స ఖర్చులు భరించడం అసాధ్యంగా మారింది. ఈ నేపథ్యంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకుడు మానం హరిబాబు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.6లక్షల ఎల్ఓసీ ఒక్క రోజులోనే మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నారు. అలాగే పర్చూరు మండలం నాగులపాలెం గ్రామానికి చెందిన తలారి అజయ్(28) వెన్నుపూసకు తీవ్ర గాయం కావడంతో ఛాతి దిగువ భాగం పని చేయకుండా మంచానికే పరిమితమయ్యాడు. ఎస్సీ వర్గానికి చెందిన ఈ పేద కుటుంబం ఆపరేషన్ ఖర్చులు భరించలేని పరిస్థితిలో ఎమ్మెల్యే ఏలూరిని ఆశ్రయించగా, ఆయన చలించిపోయి రూ.2,51,501 లను ఎల్ఓసీ ద్వారా మంజూరు చేయించి ఆ కుటుంబానికి అండగా నిలిచారు. ఇంకొల్లు మండలం వంకాయలపాడు గ్రామానికి చెందిన పెట్లూరి శివనారాయణ ప్రమాదవశాత్తు తలకు తీవ్రగాయమై అత్యవసర శస్త్ర చికిత్స అవసరమైంది. బీసీ కుమ్మరి వర్గానికి చెందిన ఈ కుటుంబం ఆర్థికంగా వెనుకబడిన నేపథ్యంలో ఎమ్మెల్యే ఏలూరి స్పందించి రూ.1,40,343 ల ఆర్థిక సాయం ఎల్ఓసీ ద్వారా తక్షణమే అందేలా చేశారు. ఈ మూడు ఘటనల్లోనూ బాధిత కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉండగా, ఎమ్మెల్యే కార్యాలయం వేగంగా స్పందించి ఒకే రోజులో చెక్కులు అందేలా చేయడం విశేషం. సహాయం అందుకున్న బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# వెలుగొండ ప్రాజెక్టుకు నీళ్లు తెప్పిస్తాం

## - ఈ ఏడాదిలోపు పనులు పూర్తి చేస్తాం

## - ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



**కొనకనమిట్ల, మార్చి 20, ప్రభాతవార్త**
పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు పనులు ఈ ఏడాది లోపు పూర్తి చేసి నీళ్లు తెప్పిస్తామని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం చింతగుంట్లలో రైతన్న మీ కోసం వారోత్సవాల సభలో పాల్గొని మాట్లాడారు.గత ప్రభుత్వం ప్రాజెక్టు పనులు పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేసి ఈ ప్రాంత ప్రజలను పిచ్చోళ్ళను చేసిందని విమర్శించారు. ఎన్నో అడ్డంకులు సృష్టించారని, ఈ ప్రభుత్వం ప్రశాంతమైన పాలన అందిస్తోందని గుర్తు చేశారు. పని చేసే ప్రభుత్వాన్ని ప్రతినిధులను గుర్తు పెట్టుకోవాలన్నారు. చింతగుంట్ల ఎస్సీ కాలనీకి ఎన్నో ఏళ్లుగా సిమెంటు రోడ్లులేవని, ఈ ప్రభుత్వంలో సీసీ రోడ్లు వేశామని, మండలంలో గనివానిపాడు గజ్జలకొండ, కొనకనమిట్ల నుంచి చింతగుంట్లకు రోడ్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఎవరు పని చేస్తున్నారా ఏ ప్రభుత్వం వల్ల మేలు జరుగుతుంది తదితర విషయాలపై గ్రామాలలో నాయకులు చర్చించాలన్నారు. అర్హులైన ప్రతి రైతుకు ఈ ప్రభుత్వంలో 20 వేలు రూపాయలు రైతు భరోసా, పీఎం కిసాన్ నిధులు ఆయా బ్యాంకు ఖాతాల్లో జమ చేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఏఎంసీ చైర్మన్ మాలపాటి వెంకట రెడ్డి, ఏ.యలమంద, ఏ.సుచేష్, వ్యవసాయాధికారి ప్రకాశం, టీడీపీ మండల కన్వీనర్ మోరబోయిన బాబురావు, రేగడిపల్లె, చిన్నారికట్ల, సొసైటీ అధ్యక్షులు కనకం నరసింహారావు, సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, మాజీ మండల కన్వీనర్లు తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వరికూటి వెంకటరామిరెడ్డి, సర్పంచ్ గొట్లగట్టు పి.సుఖదేవ్, అంకాల రోశయ్య, వెల్పుల తిరుపతయ్య, చేతరాశి కొండలు, కొనంకి సాల్మన్, శ్రీకాంత్‌రెడ్డి, పాపయ్య, వెలుగొండ ఆలయ చైర్మన్ కుందురు కాశిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన అన్నమయ్య సంకీర్తన విభావరి




**ఒంగోలు కల్చరల్ ,మార్చి 20, ప్రభాతవార్త**
వసంత నవరాత్రులను పురస్కరించుకొని నూతన పరాభవ నామ సంవత్సర సందర్భంగా స్థానిక సంతపేట శిరిడి సాయిబాబా మందిరం లో తిరుమల తిరుపతి దేవస్థానములు ధర్మప్రచార పరిషత్ గాయకులు సుమధుర స్వరనిధి ఐ మురళీకృష్ణ బృందం వారి అన్నమాచార్య సంకీర్తన విభావరి అలరించింది. దేవా నమో దేవ,ఎదుట ఎవ్వరు లేరు కొండలలో నెలకొన్న వంటి అన్నమాచార్య సంకీర్తనలతో సాగిన సంగీత ఝరి ఆసాంతం హృద్యంగా సాగి ప్రేక్షకులను విశేషంగా అలరించింది. మందిర నిర్వాహకులు అలహరి చెంచాలరావు ప్రరసం అధ్యక్షులు పొన్నూరు వెంకట శ్రీనివాసులు తదితరులు గాయకులు మురళీకృష్ణ స్వామి వారి దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి కీబోర్డుపై ఎస్కే బాబు తబలాపై బి పాండు రంగనాథం సహకరించారు.

## సుంకిరెడ్డిపాలెం పాఠశాల ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు - అధికారుల విచారణ

**పొన్నలూరు, మార్చి 20 (ప్రభాత వార్త )**
మండలంలోని సుంకిరెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు పిగిలి కొండయ్య విద్యార్థుల పట్ల ప్రవర్తిస్తున్న తీరు పై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు శుక్రవారం పాఠశాలను సందర్శించి విచారణ చేపట్టారు.ఈ సందర్భంగా ఒంగోలు ఉపవిద్యాధికారి ఏ. చంద్రమోళి, మండల విద్యాశాఖ అధికారులు రవిచంద్ర, సుబ్బరామయ్యలు పాఠశాలకు చేరుకుని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఉపాధ్యాయుడి ప్రవర్తనపై వచ్చిన ఆరోపణలను సమగ్రంగా పరిశీలించారు.విచారణ అనంతరం ఉపవిద్యాధికారి మాట్లాడుతూ, సేకరించిన వివరాల ఆధారంగా పూర్తి నివేదికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. నివేదికపై ఆధారపడి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.ఇదిలా ఉండగా విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## జడ్.మేకపాడుకు ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేసిన మాల్యాద్రి





**పొన్నలూరు, మార్చి 20 (ప్రభాత వార్త )**
మండలంలోని జడ్.మేకపాడు గ్రామ పంచాయతీ లో గత ఎనిమిది రోజులుగా కుళాయి నీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఈ సమస్యను గుర్తించిన గ్రామానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్త నవీన్, జనసేన మండల నాయకుడు యలమలమంద మాల్యాద్రిని సంప్రదించారు.దీనికి స్పందించిన మాల్యాద్రి తక్షణమే రెండు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని గ్రామానికి పంపించారు.అత్యవసర సమయంలో తాగునీరు అందించడంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం కల్పించాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

# పోకూరు - రోళ్లపాడు రోడ్డు అభివృద్ధి పనులుకు శ్రీకారం

## - రూ.3 కోట్ల పనులకు పోకూరులో శంఖుస్థాపన

## - త్వరితగతిన పూర్తిచేయాలన్న ఎమ్మెల్యే



**కందుకూరు మార్చి 20, ప్రభాతవార్త**
కందుకూరు నియోజకవర్గంలోని పోకూరు-రాళ్లపాడు రోడ్డు అభివృద్ధి పనులకు శుకృవారం స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శ్రీకారం చుట్టారు.ఇందుకోసం వలేటివారిపాలెం మండలంలోని పోకూరులో శంఖుస్థాపన చేశారు.గతంలో పోకూరు నుంచి శాఖవరం,వీఆర్‌కోట, తూనుగుంట,చీమలపెంట,తాతాహోటల్ వరకు సుమారు 18కి.మీ దూరం రోడ్డు పరిస్థితి అధ్వానంగా ఉంది.కందుకూరుతోపాటు మండలకేంద్రాలైన వలేటివారిపాలెం, లింగసముద్రంలకు రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ప్రజల ఇబ్బందులును వీఆర్‌కోట టీడీపీనేత వంకాయలపాటి మాల్యాద్రి,పోకూరు నాయకులు సోమినేని తిరుమలరావు,గట్టమనేని లక్ష్మినరసింహం తదితరులు స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దృష్టికి తీసికెళ్లారు.దీంతో ఆయన ప్రజల ఇబ్బందులును గుర్తించారు.వెంటనే స్పందించారు.సంబందిత అధికారులతో యుద్దప్రాతిపదికన ప్రతిపాదనలు తయారుచేయించారు.సమస్యపై ప్రభుత్వ పెద్దలతో చర్చించారు.ఆర్ అండ్‌బి శాఖ నుంచి సుమారు రూ.3కోట్లు ఎండీఆర్ నిధులు మంజూరు చేయించారు. పనులు ప్రారంభోత్సవ నిమిత్తం ఆయన పోకూరు వచ్చారు.ఎమ్మెల్యే రాకను ప్రజలు పెద్దఎత్తున మంగళవాయిద్యాలతో పుష్పాలంకరణతో ఘనంగా స్వాగతించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల నిర్వహణలో నాణ్యతాప్రమాణాలు పాటించాలని, త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు సూచించారు.ప్రస్తుతం రోడ్డుకు రెండు వైపులా ఉన్న డ్రైనేజీ కాలువలకు సమానంగా కొత్తరోడ్డును నిర్మించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి ఈఈ వేణుగోపాల్, జెఈ భరత్‌రెడ్డి,ఎంపీడీవో వై.శంకర్రావు,పశువైద్యాధికారి డా॥ సుదాకర్,డిప్యూటీ ఎంపీడీవో రాంబాబు, ఈవో ఆర్డీ ఎం.వి.నారాయణరావు,ఫీల్డ్ అసిస్టెంటు నవులూరి సుబ్బానాయుడు మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మినరసింహం,గ్రామ పార్టీ అధ్యక్షుడు బత్తిన వెంకటేశ్వర్లు,ఏఎంసీ మాజీ చైర్మన్ గట్టమనేని చెంచురామయ్య,నేతలు నల్లమోతు రవీంద్ర,గురజాలబెంజిమెన్,నాగభూషణం,ఘట్టమనేని సీతయ్య, అత్తోట వెంకటేశ్వర్లు,ఉన్నం వీరాస్వామి, ఆలూరి రాములు,లాయర్ పెగడ శ్రీనివాసులు,చుండి నేత చెరువుపల్లి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# దోమల విజృంభణతో ప్రబలుతున్న వ్యాధులు

## - పట్టించుకోని అధికారులు





**తాళ్లూరు, మార్చి 20,ప్రభాతవార్త**
వాతావరణంలో మార్పులతో పాటు పారిశుధ్యం లోపించి దోమలు విజృంభిస్తున్నాయి. దోమల నివారణకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో వ్యాధులకు గురికావల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా మూడో శనివారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేపడుతున్నా మొక్కుబడిగా నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దోమల నివారణకు ప్రభుత్వం పంచాయతీలకు ఫాగింగ్ మిషన్లు అందచేసినా, అసలు ఫాగింగ్ మిషన్ జోలికే పోవడంలేదు. దోమల బెడద అధికం కావడంతో కంటి మీద కునుకు లేకుండా పోయిందని వాపోతున్నారు. పారిశుధ్యం లోపించినప్పుడు తూతూమంత్రంగా బ్లీచింగ్ చల్లి మిన్నకుండిపోతున్నారు. మండలంలో ఒకటి రెండు చోట్ల తప్పా ఎక్కడా ఫాగింగ్ చేయలేదు. ముఖ్యంగా నాగంబొట్లపాలెం గ్రామంలో ఫాగింగ్ చేయలేదు అని గ్రామస్తులు వాపోతున్నారు.గ్రామాల్లో డ్రైనేజీలు, మురికి గుంటలు, పేడ దిబ్బలు పేరుకుపోవడంతో పారిశుధ్యం లోపించి దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో రాత్రివేళ్లలో ప్రజల కంటి మీద కునుకు ఉండడంలేదు. వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫాగింగ్ చేయించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## ముస్లిం సోదరులకు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఈద్ ముబారక్



**దర్శి, మార్చి 20, ప్రభాతవార్త**
ముస్లింలకు ఎంతో పవిత్రమైన రంజాన్ పండుగ సందర్భంగా దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఈద్ ముబారక్(శుభాకాంక్షలు) తెలిపారు. దీక్షలు, ఉప వాసాలు, దైవారాధన, దానధర్మాలు, చెడును తృజించడం, సాటి మానవులకు సేవ, వంటి సత్కార్యాల ద్వారా అల్లాహ్ స్మరణలో తరించే ఈ రంజాన్ పండుగ, సామరస్యానికి, సర్వ మానవ సమానత్వానికి, కరుణకు, దాతృత్వానికి ప్రతీక అని డాక్టర్ లక్ష్మీ అన్నారు. అల్లాహ్ దీవెనలతో రాష్ట్ర ప్రజలకు, దర్శి నియోజకవర్గ మానవాళికి సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో కఠిన ఉపవాస దీక్షలకు రంజాన్ ఒక ముగింపు వేడుక అని గుర్తు చేశారు. మనిషిలోని చెడు భావనల్ని, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపే గొప్ప పండుగ రంజాన్ అని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ తన సందేశంలో తెలిపారు.

# మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఐదేళ్లు పూర్తి

**- పులి శాంతికి సత్కారం**



**కనిగిరి, మార్చి 20, ప్రభాతవార్త**

కనిగిరి మున్సిపాలిటీ వైస్ చైర్మన్‌గా 2021-2026 కాలంలో విజయవంతంగా ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పులి శాంతిని వైఎస్సార్‌సీపీ 2వ వార్డు కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె సేవలను కొనియాడుతూ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు కమిటీ అధ్యక్షుడు ఎస్‌కే షరీఫ్, ఉపాధ్యక్షుడు కేతినేని నరసింహ, నాయకులు వి.రాజా, సభ్యులు కోమటిగుంట్ల భాషా, కొమ్మిరెడ్డి సుబ్బు, శనగం వరప్రసాద్, బెల్లంకొండ రంగనాయకులు, చెరుకూరి రంగయ్య, కాకర్ల నాగూరమ్మ, శ్రీను, ఉర్లగంటి నారాయణ, ఆర్నూరి అవినాష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాల అమలులో పులి శాంతి కీలక పాత్ర పోషించారని, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని తెలిపారు.

# సమాజ శ్రేయస్సు కోసం కవులు ముందుకు రావాలి





**కనిగిరి, మార్చి 20, ప్రభాతవార్త**

సమాజంలో జరుగుతున్న సమస్యలపై స్పందిస్తూ సమాజశ్రేయస్సు కోసం కవులు ఉద్యమించాల్సిన వసరం ఉందని కళాతరంగిణి వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ గయాజ్ భాష అన్నారు. కనిగిరి పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఉగాది సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. కవులు ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకుని సమాజానికి మార్గనిర్దేశం చేసే మంచి కవితలు రాయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన రిటైర్డ్ ఎంఈఓ, ప్రముఖ కవి కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఉగాది పర్వదినాన ఇలాంటి సాహిత్య కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కనిగిరి సర్వేయర్ రమణయ్య సాహితీ మిత్రులను ఒక చోట చేర్చడంలో విశేష కృషి చేశారని ప్రశంసించారు. రాబోయే రోజుల్లో కూడా ఇటువంటి సాహిత్య కార్యక్రమాలు కొనసాగాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో సాహితీ సుధ అధ్యక్షుడు కొండ్రెడ్డి నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పాలూరి శివప్రసాద్, వెండిదండి ప్రసాద్‌రెడ్డి, కాకర్ల రమణయ్య, ఎలీషా యాదవ్, చింతలపూడి కరుణానిధి, గాదె కోటిరెడ్డి, రవికుమార్, బి.శ్రీనివాసరెడ్డి, పావళ్ల మహేష్, కొండ్రెడ్డి భాస్కర్‌రెడ్డి, బృంగి సుబ్రహ్మణ్యం, రావులపల్లి శ్రీనివాస్, భగవద్గీత శైలజా తదితరులు కవితలు వినిపించారు. వెండిదండి ప్రసాద్‌రెడ్డి ఆలపించిన గీతాలు సభలోని వారిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మానవతా ప్రతినిధులు ముక్కు బాలకృష్ణారెడ్డి, రమణారెడ్డి, తిరుపతిరెడ్డి, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి, యూనియన్ నాయకులు, సాహితీప్రియులు పాల్గొన్నారు.

# వివాహ వేడుకలో పాల్గొన్న దద్దాల

**- నూతన వధువుకు ఆశీస్సులు**



**కనిగిరి, మార్చి 20, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణంలోని గోనుగుంట్ల కళ్యాణ మండపంలో నిర్వహించిన శుక్రవారం పసుపులేటి రాధిక వివాహ వేడుకలో నియోజకవర్గ వైఎస్సార్ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు. పసుపులేటి సుబ్బారావు - అచ్చుమ్మ దంపతుల కుమార్తె రాధిక వివాహ కార్యక్రమానికి హాజరైన దద్దాల నారాయణ యాదవ్ నూతన వధువును ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతి, తమ్మినేని సుజాత, పసుపులేటి దీప, పోలక సిద్దారెడ్డి, కంటూ గురవయ్య, కృష్ణ, బొట్టు శ్రీను, షేక్ రసూల్, అరుణోదర్ తదితరులు పాల్గొన్నారు. వివాహ వేడుక కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల సమక్షంలో ఘనంగా జరిగింది.

## రంజాన్ సందర్భంగా ఈద్ ముబారక్ తెలిపిన దారపనేని చంద్రశేఖర్



**కనిగిరి, మార్చి 20, ప్రభాతవార్త**

రంజాన్ పండుగ సందర్భంగా కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ ముస్లిం సోదర సోదరీమణులకు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం ముస్లింలకు అత్యంత పవిత్రమైనదని, ఈ నెలలో ఉపవాసాలు, ప్రార్ధనలు, దానధర్మాలు ద్వారా ఆధ్యాత్మిక శుద్దిని పొందుతారని పేర్కొన్నారు. నెల రోజుల ఉపవాసాల అనంతరం జరుపుకునే ఈద్ పండుగ సోదరభావం, సహనం, సమానత్వానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. రంజాన్ మాసంలో ధనికులు తమ సంపాదనలో కొంత భాగాన్ని పేదలకు ఫిత్రా రూపంలో దానం చేయడం సంప్రదాయమని, అందరూ పరస్పరం ప్రేమాభిమానాలతో పండుగను జరుపుకోవాలని అన్నారు. కనిగిరి నియోజకవర్గ ప్రజలందరికి శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని ఆకాంక్షించారు.

## నిరుద్యోగులకు కూటమి దగా.. మొక్కుబడిగా జాబ్ క్యాలెండర్

**- ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కరుణానిధి**



**దర్శి, మార్చి 20, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పండుగ రోజున నిరుద్యోగులకు సంబంధించి 10,060 ఉద్యోగాల జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించిందని, దీనిని సమగ్రంగా పరిశీలించి ఇది గతంలో ఇప్పటికే ఉద్యోగాల్లో ఉన్న వారు ఉన్నత స్థానాలకు చేరుకునేలా రూపొందించిన నోటిఫికేషన్‌లా కనిపిస్తోందని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కుణానిధి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నోటిఫికేషన్ నిరుద్యోగులకు కొత్తగా ఉద్యోగాలు కల్పించేలా లేకపోవడంతో పాటు, ఇందులో ప్రకటించిన పోస్టులు అతి స్వల్పంగా ఉండడంతో నిరుద్యోగుల్లో ఆందోళన నెలకొందని పేర్కొన్నారు.

## మారెళ్ళ పీహెచ్‌సీని సందర్శించి జిల్లా మెంటల్ హెల్త్ ఫోగ్రాం ఆఫీసర్లు



**దర్శి, మార్చి 20, ప్రభాతవార్త**

జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం కింద డిస్ట్రిక్ట్ మెంటల్ హెల్త్ ఫోగ్రాం ఆఫీసర్లు పీహెచ్‌సీ మారెళ్ళను సందర్శించారు. శుక్రవారం జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సైకాలజిస్టు ఎస్.ఏడుకొండలు సైకియాట్రిక్ సోషల్ వర్కర్ బి.అనిల్ కుమార్ సందర్శించి వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ ప్రవీణ్ కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పీహెచ్‌సీ సిబ్బందికి మానసిక వ్యాధుల గురించి వారికి చేసే సేవలు గురించి జిల్లాలో రిమ్స్ ఆసుపత్రిలోని 5 నంబర్ వార్డులో జిల్లా మానసిక వ్యాధిగ్రస్తుల చికిత్సాలయం ఏర్పాటు చేశారని తప్పనిసరిగా గ్రామీణ ప్రాంతాలో మానసిక వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి సేవలు అందించడంలో భాగంగా జిల్లా ఆసుపత్రికి సహకారం తీసుకోవాలని కోరారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు



**దర్శి, మార్చి 20, ప్రభాతవార్త**

గుంటూరు వీఏఆర్ గార్డెన్స్‌లో శుక్రవారం జరిగిన విశ్రాంత అడిషనల్ సూపరింటెండ్ పోలీసు అధికారి వాకా రాంబాబు, వెంకటేశ్వరమ్మ దంపతుల కుమారుడు శ్రీనివాస ప్రదీప్, రూపశ్రీ వివాహానికి హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించిన రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

**- ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి**



**దర్శి, మార్చి 20, ప్రభాతవార్త**

ముస్లిం సోదరులకు ఎంతో పవిత్రంగా ఆరాధించే కొలిచే పండుగ రంజాన్ అని అందరూ కలిసిమెలిసి పండుగని జరుపుకోవాలని దర్శి ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు ఈద్ ముబారక్ (శుభాకాంక్షలు) తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీక్షలు, ఉప వాసాలు, దైవారాధన, దానధర్మాలు, చెడును తృజించడం, సాటి మానవులకు సేవ, వంటి అల్లాహ్ దీవెనలతో దర్శి నియోజకవర్గ ప్రజలకి మంచి జరగాలని ఆకాంక్షించారు. మనిషిలోని చెడు భావనల్ని, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపే గొప్ప పండుగ రంజాన్ అని భాగా జరుపుకోవాలని ఆయన అన్నారు.

## వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు



**అద్దంకి , మార్చి 20, ప్రభాతవార్త :**

ఉగాది పండగ సందర్భంగా వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో పాలకమండలి సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకి ఉగాది పచ్చడి, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పంచాంగ శ్రవణం చేసిన వేదపండితులను వాసవి వనిత క్లబ్ తరఫున సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ నాగలక్ష్మి, సెక్రటరీ సునీత, ట్రెజరర్ సుజాత అమ్మవారి గుడి ధర్మకర్త ఊటుకూరు రామకోటేశ్వరరావుధర్మపత్ని ఉమఅన్నపూర్ణ, ఐతరాజా, కోటాశ్రీనివాసరావు, పాలకమండలి సభ్యులు పోకూరి శ్రీనివాసరావు, అరవపల్లి హనుమంతరావు, చిన్ని శ్రీనివాసరావు, నేరెళ్లశ్రీనివాసరావు, వాసవి వనిత క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## మణికేశ్వర ఆలయం పూజారికి ఉగాది పురస్కారం





**అద్దంకి , మార్చి 20, ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లా దేవాదాయ శాఖ, ప్రభుత్వం నిర్వహించిన ఉగాది వేడుకలు కార్యక్రమంలో అద్దంకి మండలం, మణికేశ్వరం గ్రామంలో వెంచేసియున్న శ్రీమల్లేశ్వర స్వామి దేవస్థానంలో అర్చకస్వామిగా పనిచేయుచున్న నడింపల్లి లక్ష్మీనారాయణకి ఉగాది పురస్కారం జిల్లా కలెక్టర్ రాజబాబు, ఎంపి మాగుంట శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామిలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎమ్.పానకాల రావు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

**చీరాల, మార్చి 20, ప్రభాతవార్త**

రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల, రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం పేరాల గోలి సదాశివరావు కళ్యాణ మండపం నందు 24-03-2026వ తేదీన ఉదయం 9గంటల నుండి సాయంకాలం 4గంటల వరకు జరుగునని, హైదరాబాద్ నందమూరి బసవతారకం ఇండో- అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ నుండి 6గురు డాక్టర్లు, 12 మంది స్టాఫ్ విచ్చేసి, 200 మందికి ఉచితంగా అవసరమైన వైద్య పరీక్షలు చేస్తారు. కోటి రూపాయలు విలువ గల పరికరాలు బస్‌తోపాటు వస్తున్నాయి. చీరాల ప్రాంత ప్రజలు ఈ సదవకాశాన్ని ఉపయోగించు కోవాల్సిందిగా ప్రెసిడెంట్ జాలాది కృష్ణమూర్తి, సెక్రటరీ తిరుమలశెట్టి లక్ష్మీ ప్రతాప్, ట్రెజరర్ పోలుదాసు రామకృష్ణ తెలియజేశారు.

## పరిష్కారానికి ప్రజా దర్బార్ - ఎమ్మెల్యే కొండయ్య



**చీరాల, మార్చి 20, ప్రభాతవార్త**

ప్రజల సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని చీరాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య హాజరయ్యారు. ఎమ్మెల్యే కొండయ్య ప్రజల వద్ద నుండి స్వయంగా సమస్యల వినతులు అర్జీలను స్వీకరించారు. మొత్తం 35 అర్జీలు రాగా వీటిలో ఇంటి నిర్మాణాల కోసం ఇంటి స్థలాల కోసం 17, 14 పింఛన్లు, 4 పలు సమస్యలపై అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

## నిరంతర కంటి పరీక్షల ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం



**నాగులుప్పలపాడు, మార్చి 20, ప్రభాతవార్త**

నిరంతర కంటి పరీక్షలను నిర్వహించుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందుతారని ఎల్వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ పి.ఆర్వో నాగరాజు తెలిపారు. శుక్రవారం మండలంలోని ఉప్పుగుండూరు గ్రామ పంచాయతీ ఆవరణలో ఎల్వి ప్రసాద్ ఐ హాస్పిటల్ కారంచేడు వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కనగాల శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఆర్ఓ ఆయన మాట్లాడుతూ నిరంతర పర్యవేక్ష ద్వారా కళ్ళను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని అశ్రద్ధ వహిస్తే అందత్వ దిశగా కంటి చూపు పూర్తిగా కోల్పోతారని ఆయన అన్నారు. ఉచితంగా పరీక్షలు నిర్వహించడంతో పాటుగా కాట్రాక్ట్ ఆపరేషన్లను నీటి పొరలను తొలగించే ఉచిత ఆపరేషన్ చేయించబడుతుందని ఆయన అన్నారు. 150 మందిని పరీక్షించగా 30 మందికి శుక్లాం ఆపరేషన్లు, 25 మందికి నీటి పొరల ఆపరేషన్లు చేయటానికి గుర్తించారు. వారందరికి ఎల్వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ద్వారా ఉచితంగా ఆపరేషన్ నిర్వహిస్తామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జీలు బెల్లం శ్రీనివాసరావు, పంచాయతీ స్కెటరీ సుబ్రహ్మణ్యం, సొసైటీ డైరక్టర్లు పెంట్యాల శ్రీనివాసరావు, మసిముక్కు భాస్కరరావు, జాతీయ సఫాయి మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గద్దె త్యాగరాజు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మాజీ డైరక్టర్ కొలకలూరి విజయ్ కుమార్, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గం యూత్ కార్యదర్శి పిన్నిక శ్రీకాంత్, క్లస్టర్ ఇన్‌చార్జీలు కోపర్తి నాగయ్య, మాజీ ఎంపీటీసీ కొండ్రు ఆశీర్వాదం, తెలగతోటి సుబ్బయ్య, కత్తి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతపై

**ప్రత్యేక దృష్టి ఆరించిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ**





**దర్శి, మార్చి 20, ప్రభాతవార్త**

దర్శి పట్టణంలోని అద్దంకి రోడ్డులో గల గురుకుల పాఠశాలను శుక్రవారం దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులను ఆప్యాయంగా పలకరిస్తూ మధ్యాహ్న భోజన పథకంలో ప్రభుత్వం అందిస్తున్న భోజనం నాణ్యత రుచి సరఫరా తాగునీటి వసతి ఇత సౌకర్యాలు, పాఠశాలలో ఉన్న సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనం భాగాలేకపోతే ముందు తల్లిదండ్రులకు చెప్పాలని విద్యార్థులకు సూచించారు. ఆ తర్వాత భోజనం నాణ్యతపై లీప్ యాప్ ద్వారా తల్లిదండ్రులు అభిప్రాయాలు తెలుసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా వంటశాల పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత, మెనూ అమలు విధానాన్ని సమగ్రంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షులు చిన్నా, కౌన్సిలర్ ఇత్తడి సునీత, దినకర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు డాక్టర్ చింతలపూడి రంజాన్ శుభాకాంక్షలు



**అద్దంకి, మార్చి 20, ప్రభాతవార్త**

పవిత్ర రంజాన్ మాసం ముగింపు సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణులందరికీ అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ హృదయపూర్వక ఈద్ ముబారక్ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా క్రమశిక్షణ, దానగుణం, భక్తి భావాలకు ప్రతీక రంజాన్ పండుగ అని కొనియాడారు. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలతో, అల్లాహ్ అనుగ్రహం కోసం చేసే ప్రార్థనలు అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆయన ఆకాంక్షించారు.

## ఘనంగా రామలింగేశ్వర స్వామి ఆలయంలో రథోత్సవం



**అద్దంకి , మార్చి 20, ప్రభాతవార్త**

ఉగాది పండుగ సందర్భంగా గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి పాత శివాలయంలో ఆలయ అధ్యక్షులు చిన్ని రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో రథోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన రథోత్సవ కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ డైరెక్టర్ చిన్ని లక్ష్మీ శ్రీనివాసరావు, టిడిపి సీనియర్ నాయకులు గార్లపాటి శ్రీనివాసరావు శివపార్వతి దంపతులు, ఊటుకూరి రామకోటేశ్వరరావు దంపతులతోపాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

## పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తికి ఉగాది పురస్కారం



**అద్దంకి , మార్చి 20, ప్రభాతవార్త**

శ్రీపరాభవనామ సంవత్సర ఉగాది వేడుకల సందర్భంగా సాహిత్యరంగంలో విశిష్ట సేవలందిస్తున్న ప్రముఖ కవి, గజల్ గాయకుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. బాపట్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో, బాపట్ల జిల్లా కలెక్టర్, వి. వినోద్ కుమార్, చేతుల మీదుగా, డెప్యూటీ కలెక్టర్ ఎస్. లవన్న, డి.ఆర్వో గంగాధర్, ఆర్డీవో పి. గ్లోరియా, ఎ.సి. ఎండోమెంట్స్ మల్లవరపు నాగయ్య తదితర అధికారుల సమక్షంలో ఈ పురస్కారాన్ని పుట్టంరాజు స్వీకరించారు. ఈయనను పలువరు అభినందించారు.

## మంత్రి చొరవతో కాంక్రీట్ చేసిన ఈద్గా ప్రాంతం



**అద్దంకి , మార్చి 20, ప్రభాతవార్త**

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో అద్దంకి ద్వారకా నగర్‌లో రంజాన్ పండుగ సందర్భంగా ప్రార్థనల కొరకు ఈద్గా నమాజు ప్రదేశాన్ని కాంక్రీట్ ప్లాట్ ఫామ్‌గా మార్చారు. ఊజు ఖానాలు, వాటర్ ట్యాంక్, ఈద్గాకు రంగులు వేయించి ప్రత్యేక ఆకర్షణగా తయారు చేశారు. ఈ సందర్భంగా క్లస్టర్ ఇంచార్జ్ కాకాని అశోక్‌కు అద్దంకి పట్టణ ముస్లిం మైనారిటీ సెల్ తరపున ధన్యవాదాలు తెలిపారు.

## ముస్లీం సోదరులకు మంత్రి గొట్టిపాటి రంజాన్ శుభాకాంక్షలు



**అద్దంకి , మార్చి 20, ప్రభాతవార్త**

పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ రాష్ట్ర ప్రజలకు, అద్దంకి నియోజకవర్గ ముస్లిం సోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగ క్రమశిక్షణ, దాతృత్వం, భక్తికి ప్రతీక అని ఆయన కొనియాడారు. అల్లాహ్ ఆశీస్సులతో ప్రతి ఇంటా సుఖశాంతులు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. మత సామరస్యంతో అందరూ కలిసిమెలిసి పండుగను జరుపుకోవాలని మంత్రి కోరారు.

## ఘనంగా జమ్మలమడక వారి ఉపనయన కార్యక్రమం

**- హాజరైన జడ్‌పి చైర్మన్, దర్శి ఎంఎల్ఎ, పలువురు అధికారులు, నేతలు**









**అద్దంకి , మార్చి 20, ప్రభాతవార్త**

ప్రసిద్దపుణ్యక్షేత్రమైన సింగరకొండలోని శ్రీ ప్రసన్నాంజనేయ బ్రహ్మణ నిత్య అన్నదాన సత్ర మండపంలో శుక్రవారం అద్దంకి పట్టణానికి చెందిన జమ్మలమడక హనుమంతరావు, ధర్మపత్ని రమాదేవిల ఏకైక పుత్రుడు వెంకట సాయి తరుణ్ కౌశిక్, ఉపనయన మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉదయం 7.58గంటలకు ఈ ఉపనయన కార్యక్రమం వేదపండితుల ద్వారా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా జడ్‌పి చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి శాసనసభ్యులు బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి, ధర్మపత్ని నందిని దంపతులు, రమణారెడ్డి ధర్మపత్ని సుగుణ దంపతులు, బివికెలు తదితరులు తరుణ్ కౌశిక్‌ను అశ్వీరదించి శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా దేవాదాయశాఖ ఎసి సుభద్రతోపాటు వారి భర్త సిటిఒ రవికుమార్ దంపతులుతోపాటు అద్దంకి పట్టణానికి చెందిన సింగరకొండ మాజీ చైర్మన్ కోట శ్రీనివాస్‌కుమార్, జాగర్లమూడి యలమందరావు, రాఘవరెడ్డి, మల్లికార్జున్, సింగరకొండ దేవస్థాన చైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావు, లక్ష్మీనరసింహాస్వామి దేవస్దాన ఈఒ మద్దినేని శ్రీనివాసరావు, మద్దిరెడ్డి నరసింహారెడ్డి, దామా హనుమంతరావు సతీమణి జయలక్ష్మి దంపతులు, డాక్టర్ దుర్గా ప్రసాద్‌తోపాటు పలువురు బంధువులు, మిత్రులు పాల్గొన్ని కౌశిక్‌ను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు.

## వృద్దాశ్రమంలో అన్నదానం



**దర్శి, మార్చి 20, ప్రభాతవార్త**

కురిచేడు మండలం అలవలపాడు వాస్తవ్యులు మాజీ ఎంపీపీ వీరగంధం కోటయ్య మనవరాలు నాగ వెంకట పూర్ణచంద్రిక పుట్టిన రోజు సందర్భంగా దర్శి కురిచేడు రోడ్డులోని శ్రీషిర్డీ సాయిబాబా వృద్దాశ్రమంలో వృద్దులకు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనుబాబు, అనసూయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి చొరవతో అద్దంకిలో ఉచిత సోలార్ వెలుగులు

**ఎస్.సి.ఎస్.టి. కుటుంబాలకు వరంలా పిఎం సూర్యఘర్ పథకం నియోజకవర్గంలో 5,920 మందికి ఉచిత సోలార్ ప్యానెల్స్ పంపిణీ**

**నెహ్రు నగర్‌లో పనులు ప్రారంభించిన ఈఈ మస్తాన్‌రావు**

**అద్దంకి , మార్చి 20,ప్రభాతవార్త**

అద్దంకి నియోజకవర్గంలోని నిరుపేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలఇళ్లలో సోలార్ వెలుగులు నింపనున్నాయి. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక దృష్టి సారించడంతో, నియోజకవర్గంలో పీఎం సూర్య ఘర్ ఉచిత సోలార్ విద్యుత్ పథకం ఘనంగా ప్రారంభమైంది. శుక్రవారం సంతమాగులూరు మండలం, కొప్పరం పంచాయతీ పరిధిలోని నెహ్రూ నగర్ కాలనీలో ఈ పనులను అద్దంకి విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నల్లూరి మస్తాన్ రావు పర్యవేక్షించి, పనులు ప్రారంభించారు. అద్దంకి నియోజకవర్గంలో మొత్తం 5,920 కుటుంబాలకు ఈ పథకం కింద లబ్ది చేకూరనుంది. తద్వారా నెలకు 200 యూనిట్ల కంటే తక్కువ విద్యుత్ వినియోగించే పేద కుటుంబాలను గుర్తించినట్లు ఈఈ తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 5,920 మంది లబ్ధిదారులకు 2 కిలోవాట్ సామర్థం గల రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్స్‌ను ప్రభుత్వం ఉచితంగా ఏర్పాటు చేస్తోంది. దీని ద్వారా మొత్తం 11.8 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కానుంది. మండలాల వారీగా లబ్ధిదారుల వివరాలు. అద్దంకి టౌన్‌లో 521, అద్దంకి రూరల్‌లో 1,241, కొరిశపాడు మండలంలో 1,310, జె.పంగులూరు మండలంలో 990, బల్లికురవ మండలంలో 881 ,సంతమాగులూరు మండలంలో 987, ఉచిత విద్యుత్‌తో పాటు ప్రోత్సాహకం లబ్దిదారులు ఈ ప్యానెల్స్ కోసం ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని మస్తాన్ రావు స్పష్టం చేశారు. అంతే కాకుండా, తమ ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకున్నందుకు గాను, ప్రభుత్వం ప్రతి నెలా రూ. 200 చొప్పున ప్రోత్సాహకాన్ని లబ్ధిదారులకే చెల్లించనుండటం విశేషం. ఉత్పత్తి అయిన విద్యుత్‌ను నేరుగా గ్రిడ్‌కు అనుసంధానం చేస్తారు. నెహ్రూ నగర్ కాలనీ మోడల్ విలేజ్ గా అభివృద్ధి చేస్తున్నట్లు, సంతమాగులూరు హెడ్‌క్వార్టర్ నుండి నెహ్రూ నగర్ కాలనీ వరకు సుమారు రూ. 50 లక్షల వ్యయంతో 3 కిలోమీటర్ల మేర కొత్త 11 కేవీ విద్యుత్ లైన్‌ను ఏర్పాటుచేసినట్లు మస్తాన్‌రావు తెలిపారు. పాత



లైన్ల తొలగింపు, 57 కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేశారు. 100 కేవీఏ సామర్థం గల కొత్త ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు. 3ఫేజ్ విద్యుత్ సౌకర్యంతో నిరంతర విద్యుత్ సరఫరాతో దశాబ్దాల నాటి విద్యుత్ సమస్యను పరిష్కరించారు. తమ గ్రామాన్నిమోడల్ విలేజ్‌గా తీర్చిదిద్ది నందుకు గ్రామపెద్దలు పూల రాము, పులి రామాంజనేయులు, తదితరులు మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఎం. సురేంద్ర బాబు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


# CLASSIFIED

## డాక్యుమెంట్లు పోయినవి

బూచిరాజు రవి అనినేను మాటర్మ్ డిపాజిట్ అడ్వైజ్ ఎఫ్డి డాక్యుమెంట్ నెంబర్ 1345 130 3000 1097 ఒరిజినల్ డాక్యుమెంటు ఈనెల 10వ తేదీన దర్శిలోని లంకోజనపల్లి రోడ్డులో ఉన్న మా నివాసం నుండి గడియార స్తంభం సెంటర్‌కి పోవు మార్గంలో పోయినది కావున ఇదిదొరికిన యెడల మా చిరు నామా..డోర్ నెం.5642 లంకోజనపల్లి రోడ్..దర్శి సెల్ నెం: 9100 566 756కు తెలియజేయగలరు.

## సర్టిఫికెట్‌లు పోయినవి

మద్దెల దీపక్ చందర్ తండ్రి సోనార్‌బాబు అను నేను నా ఒరిజినల్ పదవ తరగతి మార్క్స్ లిస్ట్ 0343137. ఇంటర్ మార్క్స్‌లిస్ట్ 4165923. బి ఫార్మసీ మార్క్స్ లిస్టు ఒడి 2613508. ఎం ఫార్మసీ మార్క్స్‌లిస్ట్ ఒడి 609209504005. ఫార్మసి మార్క్స్‌లిస్ట్ 062014/ఎ1 సర్టిఫికెట్లు మరియు రిజిస్టర్ సర్టిఫికెట్స్ గల బుక్ 15/02/2026 కురిచేడు రోడ్డులోని మా ఇంటి వద్ద నుండి జిరాక్స్ కోసం గడియార స్తంభం సెంటర్‌కి వెళుతుండగా దారిలో పోయినవి. దొరికిన వారు మా చిరునామా: డోర్ నెంబర్ 6-1090. సంతోష్ నర్సింగ్ హోమ్. కురిచేడురోడ్‌దర్శి.సెల్:9849603300 తెలుగలరు.

